PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 82 | విజయవాడ, ఆదివారం 22 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 22 October 2023 | Rs

కాఫీ రైతులకు మొండి చెయ్యి

- నాలుగేళ్లుగా తోటల నిర్వహణకు అందని ప్రోత్సాహకాలు

3

కుమ్మేసిన క్లాసెన్

- హెన్రిక్స్, డుస్సెన్, జెన్సన్ అర్ధసెంచరీలు
- ఇంగ్లండ్‌పై 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు

లోపలి పేజీలో..

నెల్లూరులో కెజిఎఫ్!

భారీ మైనింగ్ కుంభకోణం • రూ.10 వేల కోట్ల సంపదపై మాఫియా కన్ను

- 500 హిటాచీలతో పహారా
- వైసిపి, టిడిపి నేతల లాలూచీ

తవ్వకాలు నిర్వహిస్తున్న హిటాచీ

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

కెజిఎఫ్ సినిమా గుర్తుంది కదా..! దానిని తలదన్నేలా నెల్లూరు జిల్లాలో సాగుతున్న మైనింగ్ కుంభకోణం ఇది! ఒకప్పుడు అభ్రకం (మైకా)కు ప్రసిద్ధమైన నెల్లూరు జిల్లాలోని సైదాపురం మండలంలో తాజాగా తెల్లరాయి (వైట్ స్టోన్) వెలుగులోకి వచ్చింది. ఆ రాయి కేంద్రంగా ఇక్కడ మాఫియా దందా సాగుతోంది. ప్రతి చిన్న విషయానికి ఒకరిపై ఒకరు విరుచుకుపడే వైసిపి, టిడిపి నాయకులు ఈ తెల్లరాయి విషయంలో పరస్పరం చేతులు కలిపి గుట్టుచప్పుడు కాకుండా దందా సాగిస్తున్నారు. కెజిఎఫ్ సినిమాలో మాదిరే మైనింగ్ జరుగుతున్న వైపు సామాన్యులు కన్నెత్తి చూడటానికి కూడా వీలులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మాఫియాను కాదని ఎవ్వరూ ఆ ప్రాంతంలో అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. అధికార, ప్రధాన ప్రతిపక్ష నాయకుల లాలూచీతో జరుగుతున్న వ్యవహారం కావడంతో అధికారయంత్రంగా కిమ్మనకుండా ఊరుకుంది. రెవెన్యూ, పోలీసు, మైనింగ్, అటవీశాఖ, ఎస్ఇబి ఇలా అనేకశాఖలకు ఇక్కడ నుండి తరలిపోతున్న వేల కోట్ల రూపాయల సంపద విషయం తెలిసినా, మొద్దు నిద్ర నటిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి నుండి చెన్నయ్ ఓడరేవు ద్వారా వెయ్యికోట్ల రూపాయల తెల్లరాయి చైనాకు తరలివెళ్లినట్లు సమాచారం.

ఐదు నెలల నుంచి ....

సైదాపురం ప్రాంతంలో ఐదు నెలల నుండి మైనింగ్ మాఫియా దందా ప్రారంభమైంది. చైనాకు చెందిన కొందరు వ్యాపారవేత్తలు, స్థానిక రాజకీయనేతలు

మిగతా 2లో

సైదాపురంలో తరలింపునకు సిద్ధంగా ఉన్న తెల్లరాయి

ఏం చేస్తారు....?

తెల్లరాయికి చైనాలో ఇటీవల కాలంలో డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ రాయితో ఎక్కువగా గృహాలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తున్నట్లు చెబుతున్నారు. వీటికి అనేక దేశాల్లో డిమాండ్ ఉండటంతో ఆ దేశం నుండి ఇతర దేశాలకూ భారీ ఎత్తున ఎగుమతి అవుతున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్ భారీ స్థాయిలో ఉండటంతో కంపెనీలు లావాదేవీల కోసం తమ ప్రతినిధులను నేరుగా ఇక్కడకు పంపుతున్నారు.

ఆకాశంలోకి దూసుకెళ్తున్న కృమాడ్యూల్

బంగాళాఖాతంలో పడిన మాడ్యూల్‌ను తిరిగి తీసుకొస్తున్న నేవీ అధికారులు

'గగన్‌యాన్' టివి-డి ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 ప్రయోగ విజయాలతో రెట్టింపు ఉత్సాహంతో చేపట్టిన సరికొత్త ప్రయోగంలో రాకెట్ తొలుత మొరాయించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే లోపాన్ని సరిచేసి విజయవంతంగా ప్రయోగించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం ఉదయం 8.45 గంటలకు ప్రయోగించాలనుకున్న టివి డి1 రాకెట్ పైకి లేవకపోవడంతో ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు షార్ అధికార వర్గాలు తొలుత ప్రకటించాయి. ఆటోమేటిక్ లాంచ్ సీక్వెన్స్‌లోని ఆన్ బోర్డ్ కంప్యూటర్ ప్రయోగాన్ని ఆపేశారు. కౌన్‌డౌన్ పూర్తయినప్పటికీ సాంకేతిక లోపం వల్ల అనుకున్న సమయానికి రాకెట్ ప్రయోగం చేయలేకపోయారు.

ఈ లోపాన్ని సరిచేసి గంటా 15 నిమిషాలు లేటుగా మళ్లీ ప్రయోగించారు. శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికపై నుండి ఉదయం పది గంటలకు ప్రయోగాన్ని విజయవంతం చేశారు. భవిష్యత్తులో మానవ సహిత రాకెట్ ప్రయోగాల కోసం జరిపే పరిశోధనల్లో భాగంగా మానవ రహిత కృమాడ్యులును ప్రయోగించారు. 4,520 కిలోల బరువున్న ఈ మాడ్యూల్ 17 కిలోమీటర్లు ఎత్తు వరకు వెళ్లి అక్కడ నుండి ప్యారాచూట్ల సహాయంతో శ్రీహరికోటకు సరిగ్గా పది కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతం సముద్రంలో పడిపోయింది. నేవీ సహాయంతో తిరిగి ఈ మాడ్యూల్‌ను వెనక్కు తీసుకురావడంతో ప్రయోగం విజయవంతమైనట్లు షార్ అధికారులు ప్రకటించారు.

భవిష్యత్‌లో ఇలాంటి మాడ్యూళ్లలో మనుషులను పెట్టి పైకిపంపనున్నారు. అవి తిరిగి సురక్షితంగా భూమి మీదకు చేరుకునేలా పరీక్షల నిమిత్తం ఈ ప్రయోగాన్ని ఇస్రో నిర్వహించింది. ఇలాంటి ప్రయోగాలు విజయవంతమైతే అంతరిక్ష పర్యటనలు సులభతరం కానున్నాయి.

ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రితో న్యాయమూర్తుల గ్రూప్ ఫొటో

హైకోర్టు అడిషనల్ జడ్జీలుగా నలుగురు ప్రమాణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర హైకోర్టుకు అడిషనల్ జడ్జీలుగా నియమితులైన నలుగురితో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. విజయవాడలోని తుమ్మళపల్లి కళాక్షేత్రంలో జస్టిస్ హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి మండవ, జగడం సుమతి, న్యాపతి విజయ్‌లు అదనపు న్యాయ మూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, మంత్రులు అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముందు సిఎం వైఎస్ జగన్ రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ నజీర్‌తో మర్యాద పూర్వకంగా కలిశారు.

సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం కండి

- పోలీసు అమరవీరుల దినోత్సవంలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం గౌరవ వందనాన్ని స్వీకరించారు. 'అమరులు వారు...' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అణగారిన ప్రజలు, ఆడపిల్లల భద్రత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

కొత్త టెక్నాలజీ వల్ల సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా సైబర్ సెక్యూరిటీ, డేటా దొంగతనం నుండి అనేక అంశాల్లో పోలీసులు అప్‌డేట్ కావాలని అన్నారు. హోంగార్డుల నుండి డిజి స్థాయి అధికారి వరకూ ప్రతి ఒక్కరూ మారుతున్న సవాళ్లకు అనుగుణంగా సిద్ధం కావాలని సూచించారు. అంశాల్లోనూ ఎపి పోలీసులు ముందున్నారని 130 మంది సాంకేతిక నిపుణులు ప్రజల కోసం పనిచేస్తున్నారన్న విషయం ఎంతో ధైర్యాన్నిస్తుందని పేర్కొన్నారు..

పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

అసాంఘిక శక్తులంటే...

ప్రశాంతంగా సాగిపోతున్న ప్రజా జీవనాన్ని తమ స్వార్థం కోసం దెబ్బతీస్తున్న శక్తులన్నీ అసాంఘిక శక్తులేనని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆ పదాన్ని పునర్ నిర్వచించాలని అన్నారు. ప్రభుత్వం మీద, సమాజం మీద దాడి చేసి మనుగడ సాగించాలనుకునే శక్తులు అడవుల్లోనో, అజ్ఞాతంలోనో కాకుండా ప్రజా జీవితంలో కూడా ఉంటున్నాయన్నారు. ఇటీవల నూజివీడులో విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుల్‌ను చంపారని అన్నారు. అంగళ్లలో ప్రతిపక్షనాయకుడు తన పార్టీవాళ్లను రెచ్చగొట్టారని, ఈ ఘర్షణలో 40 మంది పోలీసులు గాయపడ్డారని, ఒకరికి కన్ను కూడా పోయిందని తెలిపారు. ఇవన్నీ కూడా యాంటి సోషల్ ఎలిమెంట్స్ చేసే పనులే తప్ప ప్రజాస్వామ్యం మీదగానీ, రూల్ ఆఫ్ లా మీదా గానీ నమ్మకం ఉన్నవాళ్లు చేసే పనులు కాదని అన్నారు. స్వార్థం కోసం ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న అటువంటి వారి పనిపట్టాలని సూచించారు.

ఎన్నికలకు ఇక ఐదు నెలలే

- సమరానికి సంసిద్ధమవ్వాలని లోకేష్ పిలుపు
- 1 నుంచి భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గెలుపే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కావాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టిడిపి విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ఇక ఐదు నెలలే సమయమే ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని, వ్యవస్థల్ని మేనేజ్ చేసి 43 రోజుల నుంచి జైల్లో నిర్బంధించారని చెప్పారు. ఈ విషయంలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లాలన్నారు. జగన్ అవినీతి పరుడని, తన మరకను చంద్రబాబుకు అంటించాలని చూస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తప్పు చేయలేదని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. కృష్ణా జలాలపై రాష్ట్రం హక్కు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతాంగానికి సాగు నీరు ఇవ్వలేదన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌కు వ్యతిరేకంగా టిడిపి-జనసేన కలిశాయని చెప్పారు. నెల 23వ తేదిన టిడిపి-జనసేన జెఎసి సమావేశంలో ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ లోపు ఇరు పార్టీలు నిర్వహించే కార్యక్రమాలను ఇరు పార్టీల వారు విజయవంతం చేయాలని చెప్పారు. 'ష్టాల్లో ఉన్న ప్రజలకు భరోసా ఇచ్చేందుకు చంద్రబాబు నాయుడు ప్రారంభించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నవంబర్ 1 నుంచి తాను కొనసాగిస్తానని చెప్పారు. చంద్రబాబు అరెస్టు జరిగిన చోటే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. చంద్రబాబు అరెస్టుతో అశువులు బాసిన అభిమానుల కుటుంబాలను పరామర్శించి అండగా నిలిచేందుకు తన తల్లి భువనేశ్వరి ఈ నెల 27 నుంచి 'నిజం గెలవాలి' కార్యక్రమం ప్రారంభించి మృతుల కుటుంబాలను పరామరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరోసభ్యులు యనమల రామకృష్ణుడు, కిమిడి కళా వెంకట్రావు, వర్ల రామయ్య, నిమ్మకాయల చిన్నరాజప్ప, బొండా ఉమామహేశ్వరరావు, కాల్వ శ్రీనివాసులు, నిమ్మల రామానాయుడు, నన్నపనేని రాజకుమారి, ప్రతిభా భారతి, నక్కా ఆనంద్‌బాబు, ఏంఎ షరీఫ్,సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వంగలపూడి అనిత, జి సంధ్యారాణి పాల్గొన్నారు.

చరిత్ర ఘనం... నిర్వహణ శూన్యం...

- కాటన్ బ్యారేజీ రోడ్డు ఆధునీకరణకు మోక్షం ఎప్పుడు?
- శిథిలమైన రహదారితో ప్రయాణికుల అవస్థలు

• లోపలి పేజీలో.. •

ఐదు కోట్లకుపైనే పెండింగ్ కేసులు

- న్యాయస్థానాల్లో సత్వర విచారణ జరగాలి
- సుప్రీం తాజా ఆదేశాలు

సిఎం హామీ మళ్లీ హుళక్కేనా?

- 'వెలిగొండ'ను అక్టోబర్‌లో ప్రారంభిస్తామని ప్రకటించిన జగన్
- 11 ముంపు గ్రామాల ప్రజలు ఇప్పటికీ రిజర్వాయర్‌లోనే నివాసం
- ప్యాకేజీలు, పునరావాసం కోసం రూ.1,500 కోట్లకుపైగా అవసరం

వెలిగొండ ప్రాజెక్టు రెండో టర్నల్ సొరంగం (ఫైల్)

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

'వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించాకే ఎన్నికలకు పోతాం. అక్టోబరులో వెలిగొండ నీళ్లను విడుదల చేస్తాం' అని సిఎం జగన్ గతంలో ప్రకటించారు. ఇదే విషయాన్ని ఆయన పలుమార్లు సభల్లోనూ చెప్పారు. ఇటీవల కర్నూలు జిల్లాలోనూ గుర్తు చేశారు. అక్టోబర్ రానే వచ్చింది. మరో పది రోజులే మిగిలింది. ఆచరణకు తగ్గ చర్యలు లేవు. దీంతో, ఆయన హామీ మళ్లీ హుళక్కేనా? అనే చర్చ సాగుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దీన్ని ప్రారంభిస్తామని జగన్ గతంలో ప్రకటించారు. ఏటా ఇదే మాట చెబుతూ వచ్చారు. ప్రాజెక్టును ఆయన సందర్శించారు. పనులపై గతంలో సమీక్ష కూడా చేశారు. పశ్చిమాన వైసిపికి బలం ఉన్నందున దీన్ని ఇప్పుడు హడావిడిగా పూర్తి చేయాల్సిన అవసరం ఏముందనే ధోరణి పాలకపక్షంలో కనిపిస్తోందన్న చర్చ సాగుతోంది. ఈ ప్రాజెక్టును మరో పది రోజుల్లో ప్రారంభిస్తారనే దానికి నమ్మశక్యంగా పనులు లేవు. చర్యలూ కనిపించడం లేదు. సిఎం ఈ నెలలో వస్తారా? లేదా? అనేదీ స్పష్టత లేదు. ప్రాజెక్టు పనులు పూర్తయి ఆఖరు దశలో ఉన్నాయి. నిర్మాణ పనులు దీని ప్రారంభానికి ఏమీ ఆటంకంగా లేవనే చెప్పాలి. అయితే, పునరావాసమే పెద్ద సవాలుగా మారింది. దీనిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. ఇప్పటికీ రిజర్వాయర్‌లోనే 11 ముంపు గ్రామాలు ఉన్నాయి. ఏడు వేల మందికిపైగా అక్కడే నివాసం ఉంటున్నారు. అక్కడి భూముల్లో అన్ని రకాల పంటలూ సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్యాకేజీలు, పరిహారాలు పూర్తిగా ఇచ్చి కాలనీల్లో ఇళ్లు కట్టించాక ఖాళీ చేద్దామనే ఆలోచనలో నిర్వాసితులు అక్కడే ఉన్నారు. ఈ ప్రాజెక్టుకు 1996లో అప్పటి సిఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2004లో వైఎస్ సిఎం అయ్యాక పనులు మొదలయ్యాయి. డ్యాము పనులు ఎప్పుడో పూర్తయ్యాయి. రెండు సొరంగాల్లో మొదటి సొరంగం పనులు పూర్తి కాగా, రెండో సొరంగం పనులు ఆఖరు దశలో ఉన్నాయి. పొలాలకు గతంలోనే పరిహారం చెల్లింపు జరిగింది. ప్రాజెక్టును ప్రారంభించాలంటే ముందుగా అక్కడున్న నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వాలి. ఒక్కో కుటుంబానికి రూ.12.50 లక్షలు వన్‌టైం సెటిల్‌మెంటు కింద ప్యాకేజీ ఖరారు చేశారు. ఇంతవరకూ నిధులు విడుదల కాలేదు. నిర్వాసితులు ఉన్నపళంగా బయటకు రావాలన్నా కుదరదు. ఎందుకంటే వారికి పునరావాస కాలనీల్లో ఇళ్లు కట్టించాలి. ఈ ప్రక్రియ కూడా జరగలేదు. ఇవన్నీ జరగాలంటే కనీసం

మిగతా 2లో

నీట్‌కు వ్యతిరేకంగా

తమిళనాడులో సంతకాల సేకరణ

- తొలిసంతకం చేసిన సిఎం స్టాలిన్

చెన్నై: దేశ వ్యాప్తంగా ప్రముఖ వైద్య విద్యా సంస్థల్లో వైద్య కోర్సుల ప్రవేశం కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం పోరాడుతోంది. అధికార డిఎంకె శనివారం రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ప్రారంభించింది. డిఎంకె అధ్యక్షుడు, సిఎం ఎంకె స్టాలిన్ తొలి సంతకం చేశారు. నీట్‌కు వ్యతిరేకంగా 50 రోజుల్లో 50 లక్షల సంతకాలు సేకరించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపనున్నారు. నీట్ పరీక్ష రాసి అర్హత సాధించని సుమారు 22 మంది తమిళ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో డిఎంకె ప్రభుత్వం నీట్‌కు వ్యతిరేకంగా గళమెత్తింది. సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఇది ఉందని విమర్శించింది. పట్టణ విద్యార్థులు, కోచింగ్ సెంటర్‌లకు అనుకూలంగా ఉన్న నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. తమిళనాడుకు నీట్‌ను మినహాయించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానించిన బిల్లును రాష్ట్రపతికి పంపింది. ఈ బిల్లు ఆమోదం కోసం డిఎంకె ప్రభుత్వం ఎదురుచూస్తోంది.

పాలస్తీనీయులకు సంఘీభావంగా లండన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలస్తీనియన్లకు సంఘీభావంగా

కైరో, లండన్‌లలో భారీ ర్యాలీలు

కైరో, లండన్: గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణకాండను ఆపాలని, మానవతా సాయాన్ని అందజేయాలని కోరుతూ కైరో, లండన్‌లలో లక్షలాదిమందితో భారీ ర్యాలీలు నిర్వహించారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం ఈజిప్టు రాజధాని కైరోలో ప్రజలు పెద్దయెత్తున గుమికూడి రాజధాని వీధుల్లో కదంతొక్కారు. 'మీ కోసం మేం త్యాగాలు చేస్తాం పాలస్తీనా' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. పాలస్తీనీయులకు పూర్తి సంఘీభావం తెలుపుతూ లండన్‌లోనూ అపూర్వమైన రీతిలో ప్రదర్శన జరిగింది. గత శనివారం లక్షా 50వేల

మిగతా 5లో

రాష్ట్ర ప్రజలకు సిఎం దసరా శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయదశమి అని ఆయన పేర్కొన్నారు. జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ప్రజలందరికీ కనకదుర్గమ్మ దీవెనలు, ఆశీస్సులు ఉండాలని ఆయన పేర్కొన్నారు.

స్కావెంజర్స్ విషయంలో సుప్రీం తీర్పును పటిష్టంగా అమల్జేయాలి

- ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మురుగు కాలువలు శుభ్రం చేసే స్కావెంజర్స్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పును, స్కావెంజింగ్ వర్క్ నిషేదం, పునరావాస చట్టాలను పటిష్టంగా అమల్జేయాలని కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు కె నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, కోశాధికారి ఎస్ జ్యోతిబసు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కావెంజర్స్ ప్రమాదంలో చనిపోతే రూ.30 లక్షలు, శాశ్వత అంగ వైకల్యం పొందిన వారికి రూ.20 లక్షలు, ఇతరత్రా వైకల్యం పొందితే రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జస్టిస్ ఎస్.రవీంద్రభట్, జస్టిస్ అరవింద్‌కుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. మాన్యువల్ స్కావెంజింగ్ వర్క్‌ను 1993లో కేంద్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ నేటికీ నిషేదం అమలులోకి రాలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును, స్కావెంజింగ్ వర్క్ నిషేదం, పునరావాస చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వక్ఫ్‌బోర్డు మెంబర్లుగా ఏడుగురు నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వక్ఫ్ బోర్డు మెంబర్లుగా ఏడుగురిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేట్ అయిన సభ్యులు ఖాదర్‌భాష, మీర్ హుసేన్, షఫీ అహ్మద్ ఖాద్రీ,బరకత్ ఆలీ, జె నజీర్ భాష, పటాన్‌షఫీ అహమ్మద్, మహిళా మెంబర్లుగా హసీనా బేగం, ప్రభుత్వ ఆఫీసరు మహిళా మెంబరుగా షీరీన్ బేగం ఉన్నారు. ఎంపికైన మెంబర్లుగా ఎమ్మెల్సీ రుహుల్లా, హఫీజ్‌ఖాన్, షేక్ ఖాజలను నియమితులయ్యారు.

ఓట్ల దొంగలకు బుద్ధిచెప్పాలి

- అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓట్ల దొంగలు పడ్డారని, వీరికి బుద్ధి చెప్పాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 15వ తేది వరకు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని జనసేనతో కలిపి చేయాలని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో సాగునీటి రంగాన్ని జగన్ సర్వనాశనం చేశారని విమర్శించారు. చంద్రబాబును కేసుల్లో ఇరికించడానికి కోట్లలో ప్రజల సొమ్ము వాడుతున్న జగన్, కృష్ణా ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయాలపై పోరాడేందుకు లాయర్లను పెట్టలేదని విమర్శించారు. రాష్ట్రాన్ని బాగు చేసుకోవడమే లక్ష్యంగా పవన్ కళ్యాణ్‌తో కలిశామన్నారు. రాష్ట్రంలో కరువు తాండవం చేస్తోందని చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్టు ఆన్ చేస్తే చంద్రబాబుకు పేరు వస్తుందని కావాలనే నీళ్ల వదల్లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు నిమ్మల రామనాయుడు, ఎమ్మెల్సీ పి అనురాధ, మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు తదితరులు ప్రసంగించారు.

చరిత్ర ఘనం... నిర్వహణ శూన్యం...

- కాటన్ బ్యారేజీ రోడ్డు ఆధునీకరణకు మోక్షం ఎప్పుడు?
- శిథిలమైన రహదారితో ప్రయాణికుల అవస్థలు

శిథిలమైన బ్యారేజీ రహదారి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉభయ గోదావరి జిల్లాలకు ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ తలమానికంగా నిలుస్తోంది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఈ కట్టడం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతోంది. అధికారుల అలక్ష్యం, సర్కారు నిర్లక్ష్యంతో వారధి మనుగడకు ప్రమాదం ఏర్పడింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ 5.837 కిలోమీటర్ల మేర దీన్ని నిర్మించారు. గతంలో ఈ బ్యారేజీ పైనుంచి ప్రయాణాలు సాగించేందుకు స్థానికులు, పర్యాటకులు మక్కువ చూపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ కాటన్ బ్యారేజీపై ప్రయాణం అంటేనే బెంబేలెత్తుతున్నారు. గుంతలు పడిన ఈ రహదారిలో ప్రయాణం చేయలేక నానాపాట్లు పడుతున్నారు. తాజాగా రాజమహేంద్రవరంలో రోడ్డు కం రైల్ బ్రిడ్జిని మూసేయడంతో కాటన్ బ్యారేజీకి రద్దీ పెరిగింది. నిత్యం వేలాది మంది వాహనదారులు ఈ బ్యారేజీపై రాకపోకలు సాగిస్తున్నారు. గుంతల వల్ల కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ రహదారి పరిస్థితి మరింత దిగజారింది. పూర్తిగా గుంతలమయంగా మారింది. 2014లో ధవళేశ్వరం, బొబ్బర్లంక, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లను కలుపుతూ నిర్మించిన ఎంబ్యాక్‌మెంట్ రోడ్డుతోపాటు, ఆర్మ్‌లపై ఉన్న కాంక్రీట్ నిర్మాణంపై వేసిన బిటి లేయర్ కూడా పూర్తిగా ఛిద్రమైంది. అప్పటి నుంచి ఈ రోడ్డుకు ఆధునీకరణ పనులు చేపట్టలేదు. బ్యారేజీకి సపోర్టుగా ఉన్నగా ఉన్న పాత ఆనకట్ట పలుచోట్ల దెబ్బతింది. బీటలు వారి ప్రమాదాన్ని సూచిస్తోంది. పిచ్చుకలంక రేవులో రాళ్లు పైకిలేచిపోయాయి. బ్యారేజీ ఒడ్డున కోతకు గురికాకుండా ఉండేందుకు నిర్మించిన రాతి కట్టుబడి కూడా ఛిద్రమైంది.

కాంట్రాక్టర్లు వెనకడుగు

రహదారిపైన బిటి రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల అంచనా వ్యయంతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీనికి పరిపాలనా అనుమతి సైతం పొందారు. ఇప్పటికి ఆరుసార్లు టెండర్లు పిలిచారు. అయినా కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాలేదు. గతంలో పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం, ప్రస్తుతం పనిచేసినా సొమ్ములు వస్తాయో? రావో? అనే భయమే ఇందుకు కారణమని సమాచారం. గత పుష్కరాల సమయంలో బ్యారేజీపై తారు రోడ్డు నిర్మాణంతోపాటు రంగులు వేశారు. అనంతరం 5.837 మీటర్ల పొడవు ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరు, విజ్జేశ్వరం మొత్తం నాలుగు ఆర్మ్‌లకు ఆధునీకరణ పనుల నిమిత్తం 2017-19లో ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించింది. 175 గేట్లలో 52 గేట్లకు చిన్నచిన్న మరమ్మతులు చేసి ఊరుకుంది. అనంతరం అలాగే వదిలేయడంతో గేట్లు ఎత్తేందుకు ఉపయోగించే జనరేటర్ దెబ్బతింది. స్టాప్‌లాక్ గేట్లకు సంబంధించిన క్రేన్ మరమ్మతులకు గురైంది.

నిర్లక్ష్యంగా పాలనా యంత్రాంగం

సర్ ఆర్ధర్ కాటన్ బ్యారేజీ నిర్వహణ పట్ల పాలనా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ బ్యారేజీని తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదానిచ్చే ఉద్యాన వనాలు పూర్తిగా పాడయ్యాయి. బ్యారేజీ అందాలు తిలకించేందుకు వచ్చిన వారు సేద తీరేందుకు కనీస వసతులు కూడా ఇక్కడ లేవు. పుష్కరాల సమయంలో వేసిన ఫౌంటెన్లు పూర్తిగా పాడయ్యాయి.

పెండింగ్‌లో టిఎ బిల్లులు

- రెండేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పలు అధికారిక కార్యక్రమాలకోసం తిరిగే అధికారులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం టిఎ బిల్లులను కూడా సకాలంలో విడుదల చేయడం లేదు. వివిధ శాఖల సిబ్బందికి రెండు సంవత్సరాల నుండి టిఎ బకాయిలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. అన్ని శాఖలకు కలిపి ఈ మొత్తం కోట్ల రూపాయల్లోనే ఉంటుందని అంటున్నారు. ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఆర్థికశాఖ నుంచి స్పందన లభించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. శాఖాధిపతులు నెలకు సగం రోజులు పర్యటనలు చేయాల్సి వస్తోంది. తాజాగా కార్యదర్శుల నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కూడా జిల్లాల్లో పర్యటించాలని, రాత్రి బస కూడా గ్రామాల్లో చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వారు కూడా విస్తృత పర్యటనలకు షెడ్యూల్ తయారుచేసుకుంటున్నారు. దీంతో ఈ అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఎక్కడకు వెళ్లాలన్నా శాఖలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులనే ఖర్చు చేయాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అలా చేయడానికి వీలు లేకపోవడంతో ఆడిట్ పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఈ విషయాన్ని ఆర్థికశాఖ దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదని చెబుతున్నారు. ఒక్క ఆర్థికశాఖలోని సిబ్బందికి మినహా మిగిలిన ఏ శాఖల్లోని సిబ్బందికి టిఎ విడుదల కావడం లేదని సమాచారం.

దత్త కూతురే హత్య చేసింది!

- వృద్ధురాలి అనుమానాస్పద మృతిలో విస్తుపోయే విషయాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దత్త తీసుకున్న కూతురే తల్లిని హత్య చేసేందుకు సూత్రధారిగా మారిన సంఘటన రాజమహేంద్రవరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి డిఎస్‌పి కె.విజయపాల్ మీడియాకు శనివారం తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 18న స్థానిక కంబాలపేటకు చెందిన సిద్ధబత్తుల మార్గరెట్ జూలియానా (63) అనుమానాస్పదంగా మృతి చెందారు. సీతానగరం మండలానికి చెందిన మృతురాలి సోదరుడు కాటి అజరయ్య ఫిర్యాదుతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. జులియా, నాగేశ్వరరావు దంపతులకు పిల్లలు లేకపోవడంతో 13 ఏళ్ల క్రితం ఓ పాపను దత్తత తీసుకుని పెంచుకున్నారు. ఎఫ్‌సిఐలో మేనేజర్‌గా పని చేసి రిటైరైన నాగేశ్వరరావు గతేడాది మృతి చెందారు. జూలియా టీచరుగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. భర్త చనిపోవడంతో కంబాలపేటలోని సొంతింటిలో తల్లీ కూతుళ్లు కలిసి నివాసం ఉంటున్నారు. ఆ బాలిక ఇటీవల గార ఆకాష్‌తో ప్రేమలో పడినట్టు తల్లి గమనించింది. దీంతో, బాలికను మందలించింది. తన స్వేచ్ఛకు ఆమె వస్తోందని భావించిన దత్త కూతురు తల్లిపై ద్వేషం పెంచుకుంది. ఈ నెల 17న సాయంత్రం 7:30 గంటలకు మార్గరెట్ జూలియా ప్రమాదవశాత్తు కాలుజారి బాత్రూంలో పడిపోయింది. గాయం తగలడంతో ఇంటిలోనే విశ్రాంతి తీసుకుంటోంది. ఇదే అవకాశంగా భావించిన ఆ బాలిక తన ప్రేమికుడైన ఆకాష్‌కు సమాచారం అందించింది. తన తల్లిని అంతముందిస్తే రూ.కోట్ల ఆస్తి సొంతం చేసుకోవచ్చని భావించింది. దీంతో, ఒక పథకం ప్రకారం ఆకాష్, ఆయన స్నేహితులు అక్షయ్ కుమార్, దినేష్ రాయి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటిలోకి ప్రవేశించారు. జూలియా నిద్రపోతుండగా ఆమె కాళ్లను దినేష్ రాయి, చేతులను అక్షయ్ కుమార్ పట్టుకున్నారు. ఆమెను ముఖంపై బాలిక, ఆకాశ్ అక్కడున్న క్లాత్‌తో నొక్కి ఊపిరి ఆడకుండా హత్య చేసినట్టు విచారణలో వెల్లడైందని డిఎస్‌పి తెలిపారు. నిందితులు నలుగురినీ శనివారం గామన్ వంతెన వద్ద అదుపులోకి తీసుకొని మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు.

భార్య ప్రసవం, భర్త మృతి ఒకే ఆస్పత్రిలో

పల్నాడు జిల్లాలో తీవ్ర విషాద ఘటన

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రసవం నిమిత్తం భార్యను ఆస్పత్రులకు తిప్పిన భర్త... అప్పుడే జన్మించిన తన బిడ్డను చూడకుండానే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన రామాంజినికి పురిటి నొప్పులు రావడంతో శుక్రవారం రాత్రి పది గంటలకు ఆమెను కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ ఆస్పత్రిలో సదుపాయాలు సరిగా లేవని గురజాల ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో, రాత్రి 11 గంటలకు గురజాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా సదుపాయాలు లేవని నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సిఫారసు చేశారు. దీంతో, చేసేదేమీ లేక గర్భిణీని కుటుంబ సభ్యులు 70 కిలోమీటర్ల దూరంలోని నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. దారి పొడవునా ఆమె మూడు గంటలుగా నరకయాతన అనుభవించారు. ఆస్పత్రిలో రామాంజిని పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. గురజాల వరకూ భార్యకు తోడుగా వచ్చిన ఆమె భర్త ఆనంద్ (31) ఇంటికి వెళ్లి డబ్బులు తేవడానికి శుక్రవారం అర్ధరాత్రి బయలుదేరారు. బైక్‌పై కారంపూడిలోని ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యంలో జూలకల్లు వద్ద రహదారిపై పెద్ద గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆయనను నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికే చికిత్స కోసం తరలించారు. శనివారం తెల్లవారుజామున ఆస్పత్రి వద్దకు చేరగానే ఆనంద్ మృతి చెందారు. పుట్టిన బిడ్డను కనులారా చూడకుండానే కన్నుమూశాడని బంధువులు విలపించారు. భార్యను దగ్గరుండి చూసుకోవాల్సిన సమయంలో ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనంద్ దంపతులకు ఇప్పటికే ముగ్గురు పిల్లలు పిల్లలు అఖిల (9), అక్షయ(7), తరుణ్ (5) ఉన్నారు. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆనంద్ ఇటువంటి పరిస్థితిల్లో మృతి చెందడంతో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆయన భార్య, పిల్లలు, బంధువుల రోదన చూపర్లను కంటతడి పెట్టించింది. అత్యవసర సమయంలో గర్భిణులకు సాధారణ కాన్పులు కూడా చేయలేని స్థితిలో కారంపూడి, గురజాల ఆస్పత్రులు ఉన్నాయని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

నెల్లూరులో కెజిఎఫ్!

(మొదటి పేజీ తరువాయి)

తమ అనుచరులు, మందీ మార్బలంతో అప్పటి నుండి ఈ ప్రాంతంలో మకాం పెట్టారు. మండలంలోని పెరుమళ్లపాడు, చాగణం, గులించర్ల, కృష్ణారెడ్డిపల్లి, మర్లపూడి, పిచ్చిరెడ్డిపల్లి, పాలూరు, గ్రామాల్లో కొండలు, అడవులు, ప్రభుత్వ భూమి, పెద్ద ఎత్తున ఉన్నాయి. అధికారికంగా పదిమంది పేర్లతో ఈ ప్రాంతంలో మైనింగ్ లీజుకు తీసుకుని విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నారు. ఒకప్పుడు భారీఎత్తున సాగి, ఇప్పుడు నామమాత్రానికే పరిమితమైన మైకా మైనింగ్‌ను కూడా అడ్డుపెట్టుకుని తెల్లరాయి వెలికితీత సాగిస్తున్నారు. ఐదు నెలల క్రితం వరకు ఒక టన్ను కేవలం రూ.2 వేలు మాత్రమే ధర ఉండగా చైనాలో డిమాండ్ పెరగడంతో రాయి నాణ్యతను బట్టి రూ.10 వేల నుంచి రూ.22 వేలకు ధర పలుకుతోంది. దీంతో ఆ దేశానికి చెందిన వ్యాపార వేత్తలు నేరుగా ఇక్కడకు వచ్చి బేరసారాలు మొదలు పెట్టారు.

తరలింపు ఇలా....

తవ్వకాలు జరపడానికి సుమారు 500 హిటాచీలు సైదాపురంలో తిరుగుతున్నాయి. జెసిబి, హిటాచీ సహాయంతో రాళ్లను బయటకు తీస్తారు.అక్కడ నుంచి టిప్పర్లతో క్రషింగ్ పాయింట్ వద్దకు చేర్చుతారు. అక్కడ చిన్నముక్కలుగా చేసి లారీల్లో తరలిస్తారు. ఒక్కలారీలో సుమారు 24 టన్నులు తరలిపోతుంది. ఒక్కలారీ లోడ్ తెల్లరాయి విలువ సుమారు రూ.మూడు లక్షలు. రోజుకు వంద నుంచి నూటయాభై లారీలు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్రమ పర్మిట్‌లు, పాత పర్మిట్‌లతో చెన్నయ్ ఓడరేవుకు వెళ్లి అక్కడ నుంచి చైనాకు ఎగుమతి అవుతున్నాయి. ఇప్పటి వరకు అనధికార లెక్కల ప్రకారం రూ.750 నుంచి వెయ్యి కోట్ల విలువైన తెల్లరాయి తరలిపోయింది. సుమారు 5 నుంచి 10 లక్షల టన్నుల వరకు తెల్లరాయి నిల్వలున్నట్లు తెలుస్తోంది.

విభేదాలు విస్మరించి

భారీగా లాభాలు వస్తుండటంతో అధికార, ప్రతిపక్ష నేతల కన్ను ఈ ప్రాంతంపై పడింది. అధికార వైసిపి నేతలు రాష్ట్ర స్థాయి నుంచి గద్దల్లా వాలిపోయారు. వైసిపికి చెందిన మంత్రి ఒకరు, ఎంఎల్‌ఎలు, నేతలు నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. వారికి స్థానిక టిడిపి నేతల సహకారం పూర్తిస్థాయిలో లభిస్తున్నట్లు సమాచారం. మంత్రి బినామీ పేర్లతో ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ తవ్వకాలను అన్ని స్థాయిల్లో అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు ఊరకుంటోంది. వీరికి సంబంధం లేకుండా ఇతరులెవరైనా తవ్వకాలు ప్రారంభిస్తే మాత్రం వెంటనే రంగంలోకి దిగి సీజ్ చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఐదు కోట్లకుపైనే పెండింగ్ కేసులు

- న్యాయస్థానాల్లో సత్వర విచారణ జరగాలి
- పాత కేసులను పరిష్కరించాలి
- గడువులోగా వాటిని పూర్తి చేయాలి
- దేశవ్యాప్తంగా పేరుకుపోతున్న కేసులపై సుప్రీం తాజా ఆదేశాలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు కోట్ల సంఖ్యలో పేరుకుపోతున్నాయి. పరిష్కారాలు లభించక తుది తీర్పుల కోసం ఎదురు చూస్తున్నాయి. పిటిషనర్లు సైతం ఈ పెండింగ్ కేసులతో విసుగెత్తిపోతున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా పలు కోర్టుల్లో దాదాపు ఐదు కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు న్యాయస్థానాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పాత కేసులను సత్వరమే విచారించి, పరిష్కరించాలని ఆదేశించింది. న్యాయవిచారణ ప్రక్రియ ఇలాగే నత్తనడకన కొనసాగితే పిటిషనర్లు తప్పుగా భావించే అవకాశమున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. గడువులోగా న్యాయ విచారణను పూర్తి చేయాలని తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ నేతృత్వంలోని బెంచ్.. జిల్లా, తాలూకా స్థాయిల్లోని అన్ని కోర్టులను ఆదేశించింది. సమన్లను సక్రమంగా అమలు చేయాలనీ, రాతపూర్వక వాంగ్మూలాలను గడువులోగా దాఖలు చేయాలనీ, ప్లీడింగ్స్ పూర్తయిన తర్వాత నిర్ణీత రోజున ఇరుపార్టీలను పిలవాలని స్పష్టం చేసింది. విచారణ ముగిసిన తర్వాత మౌఖిక వాదనలు తక్షణ వినాలనీ, కేసు విచారణ ముగిసిన తేదీ నుంచి 30 రోజులలో సాధారణంగా తీర్పులు వెలువడాలని తెలిపింది. ఐదు సంవత్సరాలు దాటిన ప్రతి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి గణాంకాలను ప్రతి ప్రిసైడింగ్ అధికారి నెలకు ఒకసారి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జికి పంపాలనీ, వారు (ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేదా జిల్లా జడ్జి) వాటిని క్రోడీకరించి తదుపరి చర్యలు తీసుకోవడానికి వీలు కల్పించటం కోసం సంబంధిత హైకోర్టుల ద్వారా ఏర్పాటైన రివ్యూ కమిటీకి పంపాలని వెల్లడించింది. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ప్రకారం.. జిల్లా కోర్టుల్లో 4,37,35,155 కేసులు (3,30,43,812 క్రిమినల్, 1,06,91,343 సివిల్) పెండింగ్‌లో ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 25 హైకోర్టుల్లో 84,68,084 కేసులు (17,36,714 క్రిమినల్, 67,31,370 సివిల్ కేసులు) పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

ఉగ్రవాది మసూద్ అజార్ సన్నిహితుడు మాలిక్ హతం..!

లాహోర్: జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాది మసూద్ అజార్‌కు అత్యంత సన్నిహితుడు, లష్కర్ ఎ జబ్బార్ వ్యవస్థాపకుడు దావూద్ మాలిక్ హత్యకు గురయ్యాడు. పాకిస్థాన్‌లోని ఉత్తర వజీరిస్థాన్ దావూద్ మాలిక్ ఓ ప్రైవేట్ క్లినిక్‌లో ఉండగా ముసుగులు ధరించి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో ప్రాణాలు కోల్పోయాడు. భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల జాబితాలో ఉన్నవారు ఇటీవల పాక్‌లో హత్యకు గురవుతున్నారు. ఇప్పటికే పఠాన్‌కోట్ దాడి సూత్రధారి షాహిద్ లతీఫ్‌తోపాటు ఐఎస్ఐ ఏజెంట్ ముల్లా బహూర్ అలియాస్ హొర్మూజ్ కాల్పుల్లో మరణించారు. దావూద్ మాలిక్‌కు లష్కరే జాంగ్వీలతో సంబంధాలున్నాయి. మసూద్ అజార్, హఫీజ్ సయీద్, లఖ్వీ, దావూద్ ఇబ్రహీంతో పలువురిని భారత ప్రభుత్వం ఉగ్రవాదులుగా ప్రకటించింది. పుల్వామా దాడి తర్వాత బాలాకోట్‌పై భారత సైన్యం వైమానిక దాడులు చేసిన విషయం తెలిసిందే.

లలితా త్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మ

- కాణిపాకం దేవస్థానం తరుపున సారె

ప్రజాశక్తి - యంత్రాంగం

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజూ లలితా త్రిపురసుందరీ దేవిగా దుర్గమ్మను అలంకరించారు. దుర్గమ్మకు చిత్తూరు జిల్లాలోని కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ.వెంకటేష్, దేవస్థానం చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై తిరుమల శ్రీవారు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీ మలయప్ప స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా యాత్రికులు కర్పూరహారతులు సమర్పించారు. సూర్యప్రభ వాహనసేవలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 15 కళాబృందాల్లో 408 మంది కళాకారులు పాల్గొని సంగీత, నృత్య ప్రదర్శనలు చేశారు.

పొగాకు బోర్డు చైర్మన్‌గా స్థానిక రైతునే నియమించాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పొగాకు బోర్డు చైర్మన్‌గా తాడేపల్లికి చెందిన ఎన్నారై యశ్వంత్ కుమార్‌ని నియమించినట్లుగా కేంద్ర క్యాబినెట్ అపాయింట్మెంట్స్ కమిటీ ప్రకటించడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. పొగాకు పండిస్తున్న ప్రాంతంలో గాని, పొగాకు రంగంతో గాని సంబంధంలేని ఒక ఎన్నారైకి బోర్డు చైర్మన్ బాధ్యతలు అప్పగించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. గతంలో ఈ రంగంలో అనుభవం ఉన్న ఐఎఎస్ స్థాయి అధికారులను పొగాకు బోర్డు ఛైర్మన్‌గా నియమించేవారని గుర్తు చేశారు. ఆ సంప్రదాయాన్ని బిజెపి ప్రభుత్వం పాటించలేదని తెలిపారు. కనీసం పొగాకు రైతులు ఎన్నుకున్న వారినయినా ఛైర్మన్‌గా నియమిస్తే ఉపయోగం ఉండేదని తెలిపారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగిన నిష్పత్తిలో పంటలకు ధరలు దక్కక రైతులు అప్పుల పాలయ్యారని, పొగాకు పంటలో సాగు ఖర్చులను, మార్కెట్ సమస్యలను అర్థం చేసుకోవడానికి వాటి పరిష్కారం కోసం పని చేయాలంటే పొగాకు పంట సేద్యంతో లోతైన అనుభవం ఉన్న రైతాంగం నుండి స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న వారిని ఛైర్మన్‌గా నియమించడం ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రం ఇప్పటికైనా బోర్డు ఛైర్మన్ నియామకంలో రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి రైతు ప్రయోజనాలను పరిరక్షించే విధంగా నియామకాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

గోదావరిలో నలుగురు యువకుల గల్లంతు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంక పుష్కర ఘాట్ వద్ద స్నానానికి దిగి నలుగురు యువకులు గల్లంతయ్యారు. వారి స్నేహితులు తెలిపిన సమాచారం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని సజ్జాపురం గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు యానాం వచ్చారు. అక్కడి నుంచి గోపులంక పుష్కర్ ఘాట్‌లో స్నానానికి దిగారు. గోదావరిలో ఒరవడి అధికంగా ఉండడంతో నలుగురు యువకులు గల్లంతయ్యారు. మిగతా వారు కొబ్బరి మట్టల సాయంతో ఒడ్డుకు చేరారు. గల్లంతైన వారిలో తణుకు ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న తిరుమల రవితేజ, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి పెండ్యాల బాలాజీ, వాసవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ముద్దన ఫణీంద్ర గణేష్, తణుకులో పాలిటెక్నిక్ చదువు మధ్యలో మానేసిన హనుమకొండ కార్తీక్ ఉన్నారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

రాజ్యాంగ విలువలకు కట్టుబడి మాట్లాడాలి

- కార్యకర్తలకు పవన్‌కళ్యాణ్ హితవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన అధికార ప్రతినిధులందరూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి పార్టీ వైఖరిని బలంగా వినిపించాలని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సూచించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జనసేన అధికార ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టివి చర్చల్లో పాల్గొనేవారు రాజకీయాలు, సమకాలీన అంశాలు, ప్రజా సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి వెళ్లాలని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వ్యక్తిగత దూషణలకు దిగరాదని హితవు పలికారు. అదే సమయంలో ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా చూసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో మరింత సంయమనంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. పార్టీ ప్రచార వ్యవస్థను పటిష్టం చేసేందుకు వచ్చే నవంబరులో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్ నిర్వహణకు టి శివశంకర్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కమిటీని ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు తమ్మిరెడ్డి శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ పాల్గొన్నారు.

పుంగనూరు ఘటన పెత్తందారీ పోకడలకు నిదర్శనం : భువనేశ్వరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యకర్తల చేపట్టిన సైకిల్ యాత్రను పుంగనూరులో అడ్డుకొని చొక్కాలిప్పించడం పెత్తందారీ పోకడలకు నిదర్శనమని టిడిపి అధినేత చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఈ ఘటన చూసి తాను షాక్‌కు గురయ్యానని శనివారం ట్విట్టర్(ఎక్స్)లో తెలిపారు. రాష్ట్రంలో రౌడీ రాజకీయానికి ఈ దాడి నిదర్శనమని, ప్రజలందరినీ నివ్వెరపరిచిందని పేర్కొన్నారు. 30 ఏళ్ల క్రితం బీహార్‌లో కూడా ఇంత అరాచక పరిస్థితులు లేవని తెలిపారు. పేదలపై పెత్తందారీ పోకడలు అంటే ఇవే అని తెలిపారు. టిడిపి కార్యకర్తలు సైకిల్ యాత్ర చేసుకునే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. నడిరోడ్డుపై బూతులు తిడుతూ సామాన్యులకు చేసిన అవమానం ప్రజలంతా గమనించారని తెలిపారు. ఎల్లకాలం నియంతల పెత్తనం సాగదని, అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదేనని పేర్కొన్నారు.

సిఎం హామీ మళ్లీ హుళక్కేనా?

(మొదటి పేజీ తరువాయి)

రూ.1,500 కోట్లు నిధులు కావాలి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో దీనికి రూ.101.47 కోట్లు మాత్రమే కేటాయించింది. మూడు జిల్లాల్లో 15 లక్షల మందికి తాగునీరు, 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు పనులు ఇరవై ఏళ్లుగా సాగుతూనే ఉన్నాయి. అప్పట్లో అంచనా వ్యయం రూ.956 కోట్లు. ప్రస్తుతం ఇది రూ.8,108 కోట్లకు చేరింది. ఇప్పటివరకూ రూ.5,972.65 కోట్లు ఖర్చు పెట్టారు. ఇంకా రూ.2 వేల కోట్లకుపైగా అవసరం ఉంది. ఎన్నికలకు ముందు రెండు గ్రామాలను ఖాళీ చేయించి ప్రారంభించాలనే ఆలోచనలో పాలకపక్ష నేతలు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో నీళ్లు లేవు. అక్కడ నుంచే సొరంగాల ద్వారా వెలిగొండ రిజర్వాయర్‌కు నీరుచేరాలి. ఇదొక సమస్యగా మారింది. ఏదేమైనా సిఎం జగన్ హామీ అమలుపై సందిగ్ధత కొనసాగుతోంది.

డబ్బులిస్తేనే పనులు తేల్చిచెబుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పనులు చేసినా బిల్లులు రాకపోవడంపై కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వందల కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించకపోతే తదుపరి పనులు కొనసాగించడం కష్టమని వారు అంటున్నారు. ఇదే అంశాన్ని ఆర్థికశాఖకు కూడా తేల్చి చెబుతున్నారు. ఎపి బిల్డింగ్ కాంట్రాక్టర్స్ సంఘం ఇదే విషయమై ఆర్థికశాఖకు పదేపదే లేఖలు రాసినా ఫలితం ఉండటం లేదు. ఇప్పటికే రోడ్లు, పోలవరం, ఇతర పథకాలకు రావాల్సిన బకాయిలపై విరివిగా లేఖలు రాస్తున్న సంఘం తాజాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాల బిల్లులపైనా లేఖలు రాసింది. అనేక కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరికొన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయని లేఖలో పేర్కొన్న కాంట్రాక్టర్లు, తమకు ఇవ్వాల్సి బిల్లులు మాత్రం చెల్లించడం లేదని ఆ లేఖలో వాపోయారు. అత్యధిక శాతం వడ్డీతో రుణాలు తీసుకువచ్చి నిర్మాణాలు చేస్తున్నామని, బిల్లులు రాకపోవడం వల్ల తమపై ఆర్థికభారం పెరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

కాఫీ రైతులకు మొండి చెయ్యి

- నాలుగేళ్లుగా తోటల నిర్వహణకు అందని ప్రోత్సాహకాలు
- ఆర్థిక స్థోమత లేక ఇబ్బందుల్లో 50 వేల మంది

ప్రజాశక్తి- పాడేరు

ఏజెన్సీలో ఐటిడిఎ ద్వారా కాఫీ తోటల పెంపకం చేపడుతున్న గిరిజన రైతులకు నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రోత్సాహక సొమ్ము చెల్లించడం లేదు. దీంతో, గిరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2020 నుంచి మూడేళ్లు వరుసగా ఏడాదికి 12 వేల ఎకరాల చొప్పున, ఈ ఏడాది 16 వేల ఎకరాల్లో ఐటిడిఎ ద్వారా కాఫీ తోటల పెంపకం చేపట్టారు. సుమారు 50 వేల మంది గిరిజన రైతులు తోటల సాగులో శ్రమించారు. వీరికి ఐటిడిఎ ద్వారా కాఫీ మొక్కలు మాత్రమే అందాయి. ఆ తరువాత ఎటువంటి సాయమూ దక్కలేదు. నర్సరీల నుంచి కాఫీ మొక్కలను కొండలపైకి చేర వేయడానికి రవాణా ఖర్చులు, గోతులు తవ్వి మొక్కలు నాటడానికి వీడింగ్ పనులు, తోటల నిర్వహణ పనులు నిమిత్తం ఎటువంటి ప్రోత్సాహకాలూ వీరికి అందలేదు. కాఫీ తోటల పెంపకానికి ప్రోత్సాహకాల కింద సుమారు రూ.54 కోట్లు చెల్లింపులు జరగాల్సి ఉందని కాఫీ రైతులు చెబు తున్నారు. గతంలో ఎకరాకు రూ.14 వేలు నుంచి రూ.18 వేలు వరకూ ప్రోత్సాహకాల కింద ఇచ్చే సొమ్మును నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వం ఇవ్వలేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యపు నీడ

'మన్యం కాఫీ'పై ప్రస్తుతం నిర్లక్ష్యపు నీడ అలుముకుంది. ప్రస్తుతం అమలవుతున్న కాఫీ ప్రాజెక్ట్ కొనసాగింపు కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఆర్ఒఎఫ్ ద్వారా పంపిణీ చేసిన కొండపోడు భూముల్లో కాఫీ సాగు చేపట్టడానికి గిరిజన రైతులు సిద్ధంగా ఉన్నారు. పాడేరు ఏజెన్సీలో సుమారు లక్ష ఎకరాల విస్తీర్ణంలో కాఫీ సాగుకు అవకాశం ఉంది. అయితే, కాఫీ సాగు పట్ల పాలకుల అలక్ష్యం వల్ల గిరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గిట్టుబాటు ధర లభించడం లేదు. శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. పాడేరు, అరకులోయ, జి.మాడుగుల మండలాల్లో కొత్తగా ఐటిడిఎ ద్వారా కాఫీ సాగు చేపట్టిన గిరిజన రైతులను 'ప్రజాశక్తి' కలిసినప్పుడు వారి మనోవేదనను వివరించారు. 'నాలుగేళ్లుగా కేవలం మొక్కలు, ప్లాస్టిక్ సంచులు మాత్రమే ఇస్తున్నారు. నర్సరీల నుంచి కొండలపైకి మొక్కలను మోసుకెళ్తున్నాం.

వాటిని నాటడానికి ఒక ఎకరాలో అడుగున్నర లోతులో వెయ్యి గుంతలు తవ్వుతున్నాం. అంతకుముందు జంగిల్ క్లియరెన్స్ చేసుకోవడం, తోట చుట్టూ కంచె కట్టడం వంటి పనులు చేపడుతున్నాం. కాఫీకి రేటు వచ్చేంత వరకూ నాలుగేళ్లు శ్రమించాల్సి వస్తోంది. కాఫీ మొక్క నాటడానికి ఒక గొయ్యి తీసేందుకు రూ.15 ఇస్తున్నాం. వాటిని పెంచేందుకు చాలా వ్యయప్రయాసలు అనుభవిస్తున్నాం. అయినప్పటికీ కాఫీకి గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇతర పనులు చేసుకుని బతకడం మేలు అనిపిస్తోంది. ప్రభుత్వం ప్రోత్సాహకం ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి' అని ఆయా ప్రాంతాల్లోని రైతులు పేర్కొన్నారు. 'కాఫీ తోటల్లో చోరీలు, అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నాయి. తోటల వద్ద కాపలా పెట్టుకుందామన్నా ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదు' అని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రోత్సాహకాలకు నిధులు మంజూరు కాలేదు

ఏజెన్సీలో ఐటిడిఎ తోడ్పాటుతో కాఫీ సాగు చేస్తోన్న రైతులకు ప్రోత్సాహకాల కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. గతంలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా కాఫీ తోటల సాగు చేపట్టినప్పుడు అన్ని పనులకూ సొమ్ము చెల్లించేవారు. ప్రస్తుతం ప్రోత్సాహకాల సొమ్ము కోసం కాఫీ రైతులు చేస్తున్న వినతుల మేరకు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒల సూచనలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

-వెంకటేశ్వరరావు, ఎపిఒ, పాడేరు ఐటిడిఎ

కాఫీ రైతుల ఆర్థిక పరిస్థితులను గుర్తించాలి

ఏజెన్సీలో కాఫీ సాగు చేస్తోన్న గిరిజన రైతుల ఆర్థిక పరిస్థితులను అధికారులు గుర్తించాలి. ప్రతి రైతుకు సాగుకు అన్ని విధాలా తోడ్పాటు అందించాలి. కాఫీ మొక్కలు నాటిన రైతులకు నాలుగేళ్లుగా ఉన్న ప్రోత్సాహక బకాయిల చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలి. కాఫీని ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి. పార్చ్మెంట్ కాఫీకి సంబంధించి కిలోకు రూ.500, చెర్రీ కాఫీ కిలోకు రూ.250, కాఫీ పండ్లు కిలోకు రూ.100 చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేయాలి. దళారీ వ్యవస్థను అరికట్టాలి. కాఫీ తోటలను వృద్ధి చేసుకోవడానికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలి. డ్రైయింగ్ యార్డ్స్, టార్పాలిన్, నిచ్చెన, పల్పర్లు పంపిణీ చేయాలి.

-గెమ్మెలి చిన్నబాబు, జాతీయ కాఫీ రైతుల సంఘం ఉపాధ్యక్షులు, సర్పంచ్, సుంకరమెట్ట, అరకులోయ మండలం

KAKINADA MUNICIPAL CORPORATION
'e' PROCUREMENT NOTIFICATION

Roc No. 6683/2023/E2, **Dated: 21-10-2023**

Tenders invited through ap e procurement platform for 22 works with an estimated contract value of **Rs. 3,67,32,036/-** from the eligible contractors in the following manner.

Nineteen Works for an amount of Rs. 2,27,31,211/-
Last date and time for downloading bid documents : 10-11-2023 upto 02-00 PM
Last date and time for submission of bids : 10-11-2023 upto 02-30 PM

Three Works for an amount of Rs. 1,40,00,825/-
Last date and time for downloading bid documents : 13-11-2023 upto 02-00 PM
Last date and time for submission of bids : 13-11-2023 upto 02-30 PM

Tender Inviting Authority:
Commissioner, Municipal Corporation, Kakinada
Mail: Call Centre Phone: 0884-2357722

Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Sd/- **CH.NAGA NARASIMHA RAO (FAC)**
Commissioner
Municipal Corporation, Kakinada

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS Translating Dreams into Reality
బ్రాంచి ఆఫీస్: 76-14-95/11, 1వ అంతస్తు, ఆర్‌టిసి వర్క్ షాప్ రోడ్, భవానిపురం, విజయవాడ-520012. CIN: L85110KA1987PLC008699
Ph: 0866-2975223, 7625079223, Email: gollapudi@canfinhomes.com

స్వాధీనత నోటీసు [రూల్ 8(1)] [స్థిరాస్తి కొరకు]

ఏదైతే, దిగువ సంతకందారుడు అయిన కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి సదరు చట్టం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ **02.08.2023 తేదీన డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. పిలువబడిన రుణగ్రహీతలు, **శ్రీమతి. పైల లలిత, భర్త పైల వెంకట రమణ (లేట్), కుమారి పైల సుష్మిత, తండ్రి పైల వెంకట రమణ (లేట్)** మరియు **కుమారి పైల భువన కృతి, తండ్రి పైల వెంకట రమణ (లేట్)** మరియు ఇతర చట్టపరమైన వారసులు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి ఉన్న **రూ.5,50,712/- (ఐదు లక్షల యాభై వేల ఏడు వందల పన్నెండు మాత్రమే)** రియలైజేషన్ తేది వరకు ఒప్పందం రేటు వద్ద తదుపరి వడ్డీతో సదరు నోటీసు తేదీ నుండి **60 రోజులలోపు** మొత్తాన్ని తిరిగి చెల్లించాలని తెలపడమైనది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఆధీకృత అధికారి అతనికి అందించిన అధికారాలను అధ్యయనం చేస్తూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని రూల్ 8తో చదువుతూ సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తిని **21వ అక్టోబర్, 2023వ తేదీన** దిగువ సంతకందారుడు **స్వాధీనపరుచుకున్నాడు.**

రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు **సిఎఫ్‌హెచ్‌ఎల్‌కు రూ.5,50,712/- (ఐదు లక్షల యాభై వేల ఏడు వందల పన్నెండు మాత్రమే)** దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు.

స్థిరాస్తి యొక్క వివరణ: ఎ.పి., కృష్ణాజిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, న్యూ రాజరాజేశ్వరి పేట యొక్క ఆర్.ఎస్.నం.59/1హెచ్ లో ఉన్న రెసిడెన్షియల్ స్థలం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ తో పాటు **"మారుతి నిలయం"** యొక్క రెండవ అంతస్తులో మొత్తం ఫ్లాట్ 100 చ.గ.లు. తో పాటు అవిభక్త వాటా యొక్క రెసిడెన్షియల్ ఫ్లాట్ విస్తీర్ణం 27.33 చ.గ.లు. కుదించబడిన ప్లింత్ ఏరియా 1027 చ.అ.లు., కామన్ ఏరియా 197 చ.అ.లు. మరియు పార్కింగ్ ఏరియా 40 చ.అ.లు. తో అందులో అన్నీ సౌలభ్య హక్కులు. ఉన్న **హద్దులు: సైట్ సరిహద్దులు: తూర్పు:** 20 అ.లు. వెడల్పు రోడ్డు, **దక్షిణం:** పెద్ది అన్నారావు ఆస్తి, **పడమర:** ఇతరుల ఆస్తి, **ఉత్తరం:** డి.వెంకట అప్పారావు ఆస్తి. **ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు:** కామన్ కారిడార్, **పడమర:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

తేది: 21.10.2023, ప్రదేశం: గొల్లపుడి సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
BHARATMALA ROAD TO PROSPERITY

ఆర్.సి ల్యాండ్-7/6/2023 కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ
తేదీ: 17.10.2023

బహిరంగ ప్రకటన

జాతీయ రహదారి నిర్మాణం కొరకు ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామం నందలి జాతీయ రహదారి యొక్క నిర్మాణం కొరకు భూమి సేకరణ, అప్పగించుటకు భూమి యజమానులు/అందు ఆసక్తి కలిగి వ్యక్తులు కొరకు మరియు నష్టపరిహార మొత్తము చెల్లింపు కొరకు ప్రకటన. జాతీయ రహదారి నిర్మాణం కొరకు ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో ఆర్.ఎస్.నెం. 267/3ఎ, 267/3బి, 267/3సి మొదలైన వాటిలో 8903.40 చదరపు మీటర్ల విస్తీర్ణం భూమి సేకరణ కొరకు 1956 జాతీయ రహదారులు చట్టం విభాగం 3ఎ క్రింద జారీ చేసిన నోటిఫికేషన్ గెజిట్ ఆఫ్ ఇండియా ఇష్యూ ఎస్.ఓ.నెం. 640(ఇ), తేదీ. 02.03.2015 నందు ప్రచురించబడిన దానిని గమనించవలసినదిగా భూమి యజమానులు / ఆసక్తి కల వ్యక్తులును కోరటమైనది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాలో ఎన్.హెచ్ 221 (న్యూ ఎన్.హెచ్-30) లో నుండి కి.మీ.0/0 నుండి కి.మీ.70/200 వరకు (విజయవాడ నుండి భద్రాచలం సెక్షన్) నందు ఎ. కొండూరు మండలం చీమలపాడు గ్రామం నందు ప్రస్తుత రహదారిని విస్తరించడం/పొడిగించడం కొరకు భూమి సేకరణ నిమిత్తం క్రింద నోటీసు జారీ చేయటమైనది. తదనుగుణంగా ఎన్.హెచ్ చట్టం 1956, 3డి (1) సెక్షన్ క్రింద నోటిఫికేషన్ ఎస్.ఓ.నెం. 16(ఇ) తేదీ. 30.12.2015 జారీ చేయబడి గెజిట్ ఆఫ్ ఇండియా నందు ప్రచురితమైనది మరియు ఈ క్రింది వార్తా పత్రికలలో ప్రచురించబడినది.

క.సం	నోటిఫికేషన్	ప్రచురించబడిన వార్తాపత్రికలు	వార్త పత్రికల తేది.
1	సెక్షన్ 3A	ది డెక్కన్ క్రానికల్ & ఆంధ్రజోతి	22.03.2015
2	సెక్షన్ 3G	హన్స్ ఇండియా & సాక్షి	05.04.2016

ఎ.కొండూరు లోని చీమలపాడు గ్రామంలో పేర్కొన్న భూమికి సంబంధించి అప్పటి కాంపిటెంట్ అథారిటీ (ఎల్.ఎ) & జాయింట్ కలెక్టర్, గతంలో కృష్ణా జిల్లా, మచిలీపట్నం నెం. 11/2015-16, తేది. 18.04.2016తో కూడిన అవార్డును ఆమోదించింది. ఎ.కొండూరు మండలం, (పూర్వపు కృష్ణా జిల్లా) ఎన్.హెచ్ చట్టం, 1956 సెక్షన్ 3జి ప్రకారం మరియు విభజన తర్వాత పేర్కొన్న మండలం ఎన్టీఆర్ జిల్లా కిందకు వస్తుంది.

భూమిని సేకరించు ఏజెన్సీ (MORTH) దిగువ సంతకందారునకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో పరిహారంమొత్తాన్ని జమచేసి ఉంచడమైనది. ఎన్‌హెచ్ చట్టం 1956లోని సెక్షను 3-ఇ క్రింద అవసరమైన ప్రకారం నంబంధిత భూమి యజమానులు/ప్రయోజనం గల వ్యక్తులకు నోటీసులు కూడా జారీ చేయబడినవి.

- తను బ్యాంకు అకౌంట్ల వివరాలను సమర్పించని భూమి యజమానులు, క్రింద తెలుపబడిన కార్యాలయంలో వెంటనే సమర్పించగలరు, మరియు ఆ మొత్తాన్నీ వారి ఖాతాలకు ఆర్‌టిజిఎస్ ద్వారా జమ చేయబడును.
- తదనుగుణంగా, హక్కుగల క్లయిందారులు, వారి పరిహారం మొత్తాన్ని 60 రోజుల కాలవ్యవధి లోపల ఉ.10.30 గం నుండి సా.05.00 మధ్య ఏదైనా పని రోజులలో దిగువ నంతకందారునకు భూ సేకరణ చేయబడిన భూమిని స్వాధీనవరచవలసినదిగా లేదా ఆధీనం చేయవలసినదిగా. ఈ అదనపు బహిరంగ ప్రకటన ద్వారా నంబంధిత భూమి యజమానులు/ప్రయోజనం గల వ్యక్తులు అందరికీ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అట్లు చేయని యెడల, సదరు భూమిని 60 రోజులు కాలం పూర్తయిన తరువాత పోలీసు వారి సహకారంతో స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది.

(సం.) డా. పి.సంపత్ కుమార్., ఐ.ఎ.యస్.,
కాంపిటెంట్ అథారిటీ భూ సేకరణ & జాయింట్-కలెక్టర్,
ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
BHARATMALA ROAD TO PROSPERITY

ఆర్.సి ల్యాండ్- 7/27/2023 కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ
తేదీ: 17.10.2023

బహిరంగ ప్రకటన

జాతీయ రహదారి నిర్మాణం కొరకు ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామం నందలి జాతీయ రహదారి యొక్క నిర్మాణం కొరకు భూమి సేకరణ, అప్పగించుటకు భూమి యజమానులు/అందు ఆసక్తి కలిగి వ్యక్తులు కొరకు మరియు నష్టపరిహార మొత్తము చెల్లింపు కొరకు ప్రకటన. జాతీయ రహదారి నిర్మాణం కొరకు ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో ఆర్.ఎస్.నెం. 268/2ఎ2, 1016/1ఎ, మొదలైన వాటిలో 2000.23 చదరపు మీటర్ల విస్తీర్ణం భూమి సేకరణ కొరకు 1956 జాతీయ రహదారులు చట్టం విభాగం 3ఎ క్రింద జారీ చేసిన నోటిఫికేషన్ గెజిట్ ఆఫ్ ఇండియా ఇష్యూ ఎస్.ఓ.నెం. 2469(ఇ), తేదీ. 20.07.2016 నందు ప్రచురించబడిన దానిని గమనించవలసినదిగా భూమి యజమానులు / ఆసక్తి కల వ్యక్తులును కోరటమైనది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాలో ఎన్.హెచ్ 221 (న్యూ ఎన్.హెచ్-30) లో నుండి కి.మీ.0/0 నుండి కి.మీ.70/200 వరకు (విజయవాడ నుండి భద్రాచలం సెక్షన్) నందు ఎ. కొండూరు మండలం చీమలపాడు గ్రామం నందు ప్రస్తుత రహదారిని విస్తరించడం/పొడిగించడం కొరకు భూమి సేకరణ నిమిత్తం క్రింద నోటీసు జారీ చేయటమైనది. తదనుగుణంగా ఎన్.హెచ్ చట్టం 1956, 3డి (1) సెక్షన్ క్రింద నోటిఫికేషన్ ఎస్.ఓ.నెం. 3375(ఇ) తేదీ. 03.11.2016 జారీ చేయబడి గెజిట్ ఆఫ్ ఇండియా నందు ప్రచురితమైనది మరియు ఈ క్రింది వార్తా పత్రికలలో ప్రచురించబడినది.

క.సం	నోటిఫికేషన్	ప్రచురించబడిన వార్తాపత్రికలు	వార్త పత్రికల తేది.
1	సెక్షన్ 3A	ది హన్స్ ఇండియా & ఆంధ్రజోతి	27.07.2016
2	సెక్షన్ 3G	ది హన్స్ ఇండియా & సాక్షి	06.05.2017

ఎ.కొండూరు లోని చీమలపాడు గ్రామంలో పేర్కొన్న భూమికి సంబంధించి అప్పటి కాంపిటెంట్ అథారిటీ (ఎల్.ఎ) & జాయింట్ కలెక్టర్, గతంలో కృష్ణా జిల్లా, మచిలీపట్నం నెం. 42/2017-18, తేది. 30.06.2017తో కూడిన అవార్డును ఆమోదించింది. ఎ.కొండూరు మండలం, (పూర్వపు కృష్ణా జిల్లా) ఎన్.హెచ్ చట్టం, 1956 సెక్షన్ 3జి ప్రకారం మరియు విభజన తర్వాత పేర్కొన్న మండలం ఎన్టీఆర్ జిల్లా కిందకు వస్తుంది.

భూమిని సేకరించు ఏజెన్సీ (MORTH) దిగువ సంతకందారునకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో పరిహారంమొత్తాన్ని జమచేసి ఉంచడమైనది. ఎన్‌హెచ్ చట్టం 1956లోని సెక్షను 3-ఇ క్రింద అవసరమైన ప్రకారం నంబంధిత భూమి యజమానులు/ప్రయోజనం గల వ్యక్తులకు నోటీసులు కూడా జారీ చేయబడినవి.

- తను బ్యాంకు అకౌంట్ల వివరాలను సమర్పించని భూమి యజమానులు, క్రింద తెలుపబడిన కార్యాలయంలో వెంటనే సమర్పించగలరు, మరియు ఆ మొత్తాన్నీ వారి ఖాతాలకు ఆర్‌టిజిఎస్ ద్వారా జమ చేయబడును.
- తదనుగుణంగా, హక్కుగల క్లయిందారులు, వారి పరిహారం మొత్తాన్ని 60 రోజుల కాలవ్యవధి లోపల ఉ.10.30 గం నుండి సా.05.00 మధ్య ఏదైనా పని రోజులలో దిగువ నంతకందారునకు భూ సేకరణ చేయబడిన భూమిని స్వాధీనవరచవలసినదిగా లేదా ఆధీనం చేయవలసినదిగా. ఈ అదనపు బహిరంగ ప్రకటన ద్వారా నంబంధిత భూమి యజమానులు/ప్రయోజనం గల వ్యక్తులు అందరికీ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అట్లు చేయని యెడల, సదరు భూమిని 60 రోజులు కాలం పూర్తయిన తరువాత పోలీసు వారి సహకారంతో స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది.

(సం.) డా. పి.సంపత్ కుమార్., ఐ.ఎ.యస్.,
కాంపిటెంట్ అథారిటీ భూ సేకరణ & జాయింట్-కలెక్టర్,
ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ

చంద్రబాబుతో కుటుంబ సభ్యుల ములాఖత్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబుతో కుటుంబ సభ్యులు శనివారం ములాఖత్ అయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అక్రమాల నేపథ్యంలో చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం, తాజాగా నవంబరు 1వ తేదీ వరకూ రిమాండ్ పొడిగించిన విషయం విధితమే. చంద్రబాబు ఆరోగ్యం సమస్యలు తలెత్తడంతో గత కొన్ని రోజులుగా కుటుంబ సభ్యులలోనూ, ఆ పార్టీ శ్రేణుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, నందమూరి రామకృష్ణ ములాఖత్ అయ్యారు. మధ్యాహ్నం 2.55 గంటలకు కుటుంబ సభ్యులు జైలు ప్రాంగణానికి చేరుకున్నారు. మూడు గంటలకు కేంద్ర కారాగారం లోనికి చేరుకున్నారు. అనంతరం 3.30 గంటలకు ములాఖత్ ముగించుకుని బయటకు వచ్చారు. ములాఖత్ అనంతరం మీడియాతో మాట్లాడకుండా హైదరాబాద్‌కు వెళ్లారు.

తగ్గిన ఉద్యోగాల కల్పన

- పిఎఫ్ చందాదారుల్లో పతనం
- ఆగస్టులో 13.3 శాతం క్షీణత

న్యూఢిల్లీ : దేశంలో ఉపాధి రంగం కుదేలు అవుతోంది. ప్రభుత్వ ఆర్థిక విధానాలు కొత్త ఉద్యోగాల సృష్టికి ఎలాంటి ఉత్సాహాన్ని ఇవ్వకపోవడంతో సంఘటిత రంగంలో కొత్త ఉద్యోగాలు తగ్గాయి. ప్రస్తుత ఏడాది ఆగస్టులో కొత్త ఉద్యోగాల నమోదులో తగ్గుదల చోటు చేసుకుందని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) గణంకాలు వెల్లడించాయి. ఈ ఏడాది జులైతో పోల్చితే గడిచిన ఆగస్టులో కొత్త ఉద్యోగాల కల్పన 13.3 శాతం పతనం చోటు చేసుకుంది. జులైలో 10.6 లక్షల కొత్త ఇపిఎఫ్ చందాదారులు నమోదు కాగా.. ఆగస్టులో ఇది 9,25,984కు పడిపోయింది.

ఇపిఎఫ్ఒ శుక్రవారం విడుదల చేసిన పేరోల్ డేటా ప్రకారం.. జులైలో 2,85,424 మహిళ సబ్‌స్రయిబర్లు నమోదు కాగా.. ఆగస్టులో 26.7 శాతం పతనమై 2,43,510గా ఉన్నారు. జులైలో 18-28 ఏళ్ల యువ చందాదారులు 7,26,415తో 67.97 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఆగస్టులో 6.32 లక్షలతో 68.3 శాతం వాటాను కలిగి ఉన్నారు. పేరోల్ డేటా సంఘటిత రంగంలో ఉపాధి కల్పనను ట్రాక్ చేయడానికి సహాయపడుతుంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఒ) కూడా దేశంలో ఉపాధి పోకడలను విశ్లేషించడానికి ఇపిఎఫ్ఒ డేటాను ఉపయోగిస్తుంది. మరోవైపు గడిచిన ఆగస్టులో ఇపిఎఫ్ నికర చందాదారులు 0.8 శాతం పెరిగి 16.9 లక్షలుగా నమోదయ్యారు. జులైలో ఇది 16.8 లక్షలుగా ఉంది. ప్రస్తుత పండగ సీజన్‌లో కొత్త చందాదారుల్లో పెరుగుదల చోటు చేసుకోవచ్చని టీమ్‌లీజ్ సర్వీసెస్ ప్రతినిధి రితుపర్ణ చక్రవర్తి తెలిపారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) ప్రకారం.. ఆగస్టులో దేశంలో నిరుద్యోగం జూలైలో 7.9 శాతం నుండి 8.1 శాతానికి పెరిగింది. ఆర్థిక వ్యవస్థ కొత్త ఉద్యోగాలను సృష్టించలేకపోయిందని పేర్కొంది.

కనీస మద్దతు ధరలోనూ కేంద్రం మోసం : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) విషయంలోనూ కేంద్రం మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం విమర్శించింది. మోడీ సర్కార్ విధానాల వల్ల రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శనివారం ప్రకటన విడుదల చేశారు. 2024-25 రబీ సీజన్‌కు ప్రకటించిన ఎంఎస్‌పిలో పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని పరిగణలోకి తీసుకోలేదని, సమగ్ర ఉత్పత్తి ఖర్చులలో కౌలు, వడ్డీ లెక్కించకుండా రైతులను మోసం చేశారని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు మద్దతు ధరను ప్రకటించి రాజకీయంగా లబ్ధి పొందాలనే కేంద్ర ప్రభుత్వ కుట్రలను రైతాంగం ఖండించాలని తెలిపారు. ప్రకటించిన మద్దతు ధరలకు కూడ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. ఇప్పటికైనా కనీస మద్దతు ధరలపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేది: 20.10.2023
టెండర్ నోటీసు
PUB/1179

భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారు తరఫున 13.11.2023న 15.00 గం. వరకు క్రింది విధమైన పనుల కొరకు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండర్ నం. : బి/ఇ.221/టిఆర్ఎస్/ఆర్‌సి/494 ఇ టెండర్ నం.ఇఎల్ఎస్-బిజెడ్ఎ-ఇటిఎన్ 09-2023-24 తేది : 20.10.2023 **పని పేరు :** మూడు దశల లోకోమోటివ్స్ క్వాంటి-165 సంఖ్యలు. మరియు రెండు ప్రాచీన బి.జి. ఎలక్ట్రికల్ లోకోమోటివ్స్ సహాయక మోటార్ల రివైండింగ్. **పూర్తి గడువు :** 24 నెలలు, **టెండర్ విలువ :** రూ.42,63,009.69/- (జిఎస్‌టి తో సహా), **ఇ.ఎమ్.డి :** రూ.85,300/- **టెండర్ డాక్యుమెంట్ ఖరీదు :** 0/-, **టెండర్ ముగింపు తేది మరియు సమయం : 13.11.2023, 15.00 గం.**

ఏదైనా టెండర్ లోని ఏదైనా మార్పులు/సవరణ కొరకు టెండర్ ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్ www.ireps.gov.in ని సందర్శించమని భావి టెండర్ దారులు సూచించబడ్డారు.

ఎస్ఆర్.డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ టిఆర్ఎస్/ఇఎల్ఎస్/విజయవాడ

టెండర్ నోటీసు నం.బి/ఇ.29-టిఆర్‌డి టిఎన్‌డిఆర్-21-23-24 తేది 19.10.2023 టెండర్ నం.బి/ఇ. 29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-21-23-24
PUB/1180

దిగువసంతకందారు ద్వారా ఐరెప్స్‌లో క్రింది పనుల కొరకు టెండర్లను ఆహ్వానించడమైనది.

పని పేరు : విజయవాడ డివిజన్ : సైడింగ్‌లకు అందించే విద్యుత్ సరఫరా మౌలిక సదుపాయాలను పెంచడం. **సుమారు విలువ :** రూ.1,11,10,777/-, **బిడ్ సెక్యూరిటీ (ఇఎమ్‌డి) :** రూ.2,05,600/-, **పూర్తి గడువు :** 12 నెలలు, **ముగింపు తేది మరియు ఎవిపి సమయం :** 20.11.2023, 15.00 గం.

క్ర.సం.1- టెండర్ ఫారం ఖరీదు రూ.: లేదు
ముగింపు తేది : క్ర.సం.1 : 20.11.2023, 15.00 గం.

ఎస్ఆర్. డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ టిఆర్‌డి/విజయవాడ
A1627

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

రైలు ప్రమాదంలో తండ్రీ కూతుళ్ల దుర్మరణం

ప్రజాశక్తి-కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా)

దసరా ఉత్సవాలలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం బాసర వెళ్తూ రైలు ప్రమాదంలో తండ్రీ కుమార్తె మృతి చెందారు. ఈ సంఘటన నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమా చారం మేరకు... ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి చెందిన చలమల రామచంద్రరావు(45) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ, కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఆయనకు భార్య సునీత, కుమార్తెలు జస్మిత, జనని (13) ఉన్నారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో సరస్వతీ దేవి ఆలయానికి శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బాసరకు రైలులో బయలుదేరారు. రామచంద్రరావు, ఆయన భార్య సునీత ఒక బోగీలో, వారి ఇద్దరు కుమార్తెలు మరో బోగీలో ఎక్కారు. అందరూ ఒకే బోగీలోకి మారేందుకు నిజామాబాద్‌లో రైలు దిగారు. భార్య ఉన్న బోగీలోకి పెద్ద కుమార్తెను ఎక్కించారు. చిన్న కుమార్తె జననీని ఎక్కించే క్రమంలో రైలు ముందుకు కదిలింది. దీంతో పట్టు కోల్పోయిన జనని ప్రమాదవశాత్తూ రైలు కింద పడిపోయింది. ఆమెను పైకి లాగే క్రమంలో రామచంద్రరావు ప్లాట్ ఫాంపై పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో జనని దుర్మరణం చెందగా, గాయపడిన రామచంద్రరావును స్థానికులు ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళ్ల ముందే భర్త, కుమార్తె మృతి చెందడంతో సునీత కుప్పకూలిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం స్వగ్రామమైన గనిఆత్కూరుకు తరలించారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

అలరిస్తున్న వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు రెండోరోజూ అలరించాయి. విజయ వాడకు చెందిన వేద గంగోత్రి ఫౌండే షన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్య నాటకం, సాంఘిక నాటిక పోటీలు శనివారంతో రెండో రోజుకి చేరాయి. పద్య నాటక ప్రదర్శనలో భాగంగా 'మహారథి కర్ణ' నాటకాన్ని ఉదయం ప్రదర్శించారు. రేణిగుంటకు చెందిన వినాయక నాటక కళామండలి ప్రదర్శించిన నాటకానికి వెంకటగిరి వీరమల్లయ్య భాగవతుల రచన కాగా, జానకిరామ్ దర్శకత్వం వహించారు. తర్వాత పాలకొల్లుకు చెందిన కళాధరి నటధామం వారి 'కారే రాజులు? రాజ్యముల్ కలుగవే' పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. పిఎస్ఆర్ ఆంజనేయులు రచనకు ఎంఎస్ కె ప్రభు దర్శకత్వం వహించారు. సాంఘిక నాటిక ప్రదర్శనలలో భాగంగా సాయంత్రం ఎంవిఎస్ హరనాధరావు రచనకు, జి విజయబాబు దర్శకత్వం వహించిన తేటగుంటకు చెందిన భాస్కరరాజు కళాపీఠం వారు 'క్షీరసాగర మధనం' నాటికను ప్రదర్శించారు. వెలగలేరు ఆర్ట్స్ థియేటర్ వారి 'రాత' సాంఘిక నాటిక ప్రదర్శన జరిగింది.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
HINDUJA HOUSING FINANCE
కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సాయిదాపేట, చెన్నై-600015. తమిళనాడు,
రీజినల్ ఆఫీసు: హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వద్ద ఇండియా రిజనల్ ఆఫీస్, 2వ అంతస్తు, టి19 టవర్స్, కర్బలా మైదాన్, రాణిగుంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్-తెలంగాణా-500003 www.hindujahousingfinance.com

అనుబంధం-IV స్వాధీనత నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002, కింద సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద, హిందూజ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్ఎఫ్ఎల్) కంపెనీ యొక్క ఆధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసును జారీ చేయబడింది. రుణగ్రహీతలు/హామీదారులకు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు మొత్తాన్ని చెల్లించాలని సదరు నోటీసులో పేర్కొనడం జరిగింది. రుణగ్రహీతలు/హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కింద సంతకం చేసిన వ్యక్తి తనకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి ఇక్కడ వివరించిన ఆస్తిని రూల్ 8తో చదువుతూ సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002,లోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) కింద స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. సురక్షితమైన ఆస్తులను రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించారు. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఆస్తితో వ్యవహరించవద్దని హెచ్చరిస్తూ, మరియు ఆస్తికి సంబంధించిన ఏదైనా లావాదేవీలు దానిపై వడ్డీతో పాటు ఇక్కడ పేర్కొన్న మొత్తానికి హెచ్‌హెచ్ఎఫ్ఎల్ చార్జీకి లోబడి ఉంటాయని తెలియజేస్తున్నారు.

క్ర. సం.	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారుల యొక్క పేర్లు/ ఎల్ఎఎన్	డిమాండ్ నోటీసు తేది & మొత్తం	స్వాధీనత యొక్క తేది
1	**LAN NO:** AP/HDB/ECIL/A000000024 1) శ్రీమతి. అలోకం అనిత, భర్త. ప్రభాకర్ రావు అలోకం, ఫ్లాట్ నం.201, అర్‌మనసా సుకుర్తీ టవర్స్, ఫ్లాట్ నం.56, సరోజిని నాయుడు నగర్, కాకతీయ హిల్స్, సొసైటీ ఆఫీస్ వద్ద, షేక్‌పేట మాధాపూర్, తెలంగాణ-500081 మరియు ఇక్కడ కూడు, డో on.7-672, ఎమ్ఆర్ఓ ఆఫీస్ వెనుక, పిడుగురాళ్ళా టౌన్, గుంటూర్, ఆంధ్రప్రదేశ్-522413. 2. శ్రీ. ప్రభాకర రావు అలోకం, ఫ్లాట్ నం.201, అర్‌మనసా సుకుర్తీ టవర్స్, ఫ్లాట్ నం.56, సరోజిని నాయుడు నగర్, కాకతీయా హిల్స్, సొసైటీ ఆఫీస్ వద్ద, షైక్‌పేట మాధాపూర్, తెలంగాణ-500081	24.11.2023 మరియు రూ. **78,92,166/-** (డెభై ఎనిమిది లక్షల తొంభై రెండు వేల ఒక వంద అరవై ఆరు రూపాయలు మాత్రమే)	**19/10/2023**
	(స్థిరాస్తి) సెక్యూర్డ్ అసెట్ యొక్క వివరణ: గుంటూరు జిల్లా, నరసరావుపేట ఆర్.డి పిడుగురాళ్ళా ఎస్.ఆర్.ఓ పరిధిలో, పిడుగురాళ్ళా మెన్సిపల్ పరిధిలో, పిడుగురాళ్ళా సర్వే నం.407, మూల్యాంకనం నం.1132002522, డో నం.7-672 కలిగి ఉన్న ఏదైతే ఆర్.సి.సి ఇల్లు (ఇండిపెండెంట్ హౌస్) లో సైట్ విస్తీర్ణం 242 చ.గ.లు లేదా 202.312 చ.మీ.లు మరియు హద్దులు: తూర్పు: కొప్పుల లక్ష్మీ సైట్, దక్షిణం: బజార్, పడమర: జొన్నల శ్రీనివాస రెడ్డి ఇల్లు, ఉత్తరం: కామిరెడ్డి కృష్ణా రెడ్డి ఇల్లు.		

తేది: 22.10.2023 ప్రదేశం: హైదరాబాద్. సం/-అధీకృత అధికారి శ్రీ.షీగ నరేష్ (సిఎల్ఎమ్) హిందుజా హైసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

POONAWALLA HOUSING FINANCE Apna Ghar, Apni Pehchan
పూనవాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(ఇంతకుమునుపు మాగ్మ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)
రిజిష్టర్డ్ కార్యాలయం: 602, 6వ అంతస్తు, జీరో వన్ ఐటి పార్క్, సర్వే నం.79/1, ఘోర్పడి, ముంధ్వా రోడ్, పూణే-411036

అనుబంధం IV [రూల్ 8(1) చూచుట] స్వాధీనత నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "సదరు చట్టం"గా సూచించడమైనది) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, పైన కార్పోరేట్/రిజిష్టర్ కార్యాలయం యొక్క **పూనవాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** (గతంలో మాగ్మ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది) యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీతలను పిలుస్తూ దిగువ తేదిన డిమాండ్ నోటీసు జారీచేయబడింది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థిని కింద తెలిపిన తేదీనాడు దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజల్ని హెచ్చరించడమేమనగా ఆస్థితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్థితో ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీని **పూనవాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** (గతంలో మాగ్మ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది) యొక్క చార్జ్‌కు లోబడి జరుపవలెను. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను. స్వాధీనత తీసుకున్న ఆస్థి వివరాలు దిగువన ఇవ్వబడినాయి:

క్ర. సం	రుణగ్రహీతల పేరు	ఆస్థి వివరణ	స్వాధీనం తీసుకున్న తేది	చట్టబద్ధమైన డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
1.	ఎర్రంశెట్టి విజయలక్ష్మి, రాజా రంగారావు ఎర్రంశెట్టి	ఎ.పి., కృష్ణాజిల్లా, పటమట సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో పెనమలూరు మండలం, కానూరు గ్రామం యొక్క ఆర్.ఎస్.నం.23/1సి లో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ప్రస్తుతం ఎర్రంశెట్టి విజయలక్ష్మి, భర్త. రాజా రంగారావు ఆధీనంలో ఉన్న సైట్ పరిధిలో 72.5 చ.గ.లు. లేదా 60.61 చ.మీ.లు. ఆర్‌సిసి రూఫ్ భవన నిర్మాణం ఉన్న హద్దులు : **సరిహద్దులు : తూర్పు:** కె.సుమతి మరియు ఇతరుల ఆస్తి, **దక్షిణం:** సిహెచ్. సుబ్బారావు ఆస్తి, **పడమర:** కొరటి శకుంతల ఆస్తి, **ఉత్తరం:** ఆర్.బలరామ్ కు చెందిన సైట్ మరియు రోడ్డు.	16/10/2023	10.07.2023	లోన్ నెం.: **HM/0053/H/17/100343 10.07.2023** నాటికి చెల్లించవలసిన **రూ.14,59,356.47/-** (పద్నాలుగు లక్షల యాభై తొమ్మిది వేల మూడు వందల యాభై ఆరు రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) రియలైజేషన్ వరకు 15.80 శాతం పి.ఎ. వడ్డీతో సహా.

ప్రదేశం: కృష్ణ
తేది: 22.10.2023
సం/- అధీకృత అధికారి
పూనవాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో మాగ్మ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)

Chola Enter a better life
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పోరేట్ కార్యాలయం: చోలా క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600 032.

స్వాధీనత నోటీసు [(అనుబంధం IV) (రూల్ 8(1) క్రింద]

ఏదైతే మెస్సర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోపట దానిపిమ్మట వడ్డీ మరియు సదరు నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు రుణగ్రహీతలు (పేరులు మరియు చిరునామా దిగువ పేర్కొనబడినాయి) పిలుస్తూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేయబడింది. రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద నా అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ దిగువ వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు ఇక్కడ క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీ మెస్సర్స్. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవచ్చును. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టంలోని సెక్షన్13 యొక్క సబ్-సెక్షన్ 8 నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించగలరు.

క్ర. సం	రుణగ్రహీత/లు పేరు మరియు చిరునామా మరియు రుణ ఖాతా నెంబర్	డిమాండ్ నోటీసు తేది	బాకీపడిన మొత్తం	స్వాధీనతా ఆస్తి వివరణ	స్వాధీనతా తేది
1.	**రుణ ఖాతా నెం(లు): HL03GUT000011323** **1. నాగరాజు లక్ష్మి తోకల, ఇరువురి నివాసం:** డో.నం.26-47-235, 5వ లైన్, నల్లకుంట, రెడ్డి కాలేజి వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ 522004. **ఇక్కడ కూడా :** కన్నా టవర్స్, అంకిరెడ్డిపాలెం గ్రామం రోడ్డు, చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ, అంకిరెడ్డిపాలెం హామ్లెట్, మస్జిద్ వద్ద గుంటూరు 522005. **బ్రంహయ్య ఓర్చు,** డో.నం. 26-47-322 8/3 లైన్ నల్లకుంట రెడ్డి కాలేజి ప్రక్కన 500044	20-06-2023	**20.06.2023** నాటికి **రూ.26,62,595/-** (ఇరవై ఆరు లక్షల అరవై రెండు వేల ఐదు వందల తొంభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	**షెడ్యూల్-ఎ :** గుంటూరు జిల్లా, నల్లపాడు ఉపజిల్లా, చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ ఏరియా, అంకిరెడ్డిపాలెం గ్రామం, డో.నం.823, బయట 2553-14 చ.గ.లు అనగా.. విస్తీర్ణం 2148-55 చ.గ.లు., హద్దులు : తూర్పు: రోడ్డు 151'-06", దక్షిణం: ఎస్.వెంకటేశ్వర్లు ఆస్తి 122'-00", పడమర: పొన్నగంటి లక్ష్మి మరియు ఇతరుల సైట్ 169'-06", ఉత్తరం: వై.రాధాకృష్ణ మూర్తి ఆస్తి 117'-03". పై సరిహద్దుల పరిధిలో 2148-55 చ.గ.లు. లేదా 1796-40 చ.మీ.లు. **షెడ్యూల్-బి :** పై సరిహద్దుల అవిభక్త మరియు పేర్కొనబడిన విస్తీర్ణం 42 చ.గ.లు. లేదా 35-11 చ.మీ.లు. పైన మొత్తం విస్తీర్ణం 2148-55 చ.గ.లు. తో కన్నా టవర్స్ లోని నాలుగవ అంతస్తులో డబుల్ బెడ్‌రూము ఫ్లాట్ నం.503 (మూల్యాంకనం నం.349) హద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: కామన్ కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై. ఈ సరిహద్దుల కన్నా టవర్స్ యొక్క నాలుగవ అంతస్తులోని పేర్కొన్న ఫ్లాట్ నం.503 ప్లింత్ ఏరియా 1150 చ.అ.లు. (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియా తో సహా) తో అన్నీ ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు తో సౌలభ్య హక్కులు, కరెంటు కనెక్షన్, సాధారణ నీటి కనెక్షన్, సాధారణ డ్రైనేజి, సాధారణ మెట్లు, సాధారణ టెర్రస్, సాధారణ బోర్‌వెల్ వాటర్ కనెక్షన్, ఒక కార్ పార్కింగ్, సాధారణ జనరేటర్, సాధారణ లిఫ్ట్ మొదలైనవి.	స్వాధీనత తేది: 19-అక్టోబర్-23

తేది: 19.10.2023
ప్రదేశం: గుంటూరు
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్., తరఫున అధీకృత అధికారి

సంపాదకీయం

కళ ప్రజల కోసం

'ఎన్ని పువ్వులెన్ని రంగులెన్ని సొగసులిచ్చాడు/ అన్నిటిలో నిన్నే చూడమన్నాడు' అంటాడో సినీ కవి. సృష్టిలో ఎన్నో రంగులు, ఎన్నో రూపాలు, ఎన్నెన్నో భావాలు, ఉద్వేగాలు... ఆ రంగుల్లో రూపు కడతాయి. ఎరుపు, పసుపు, నీలాలే కాదు... వాటి నుంచి ఎన్నో వందల, వేల వర్ణాలు ఇంద్రధనుస్సు విరబూసినట్లుగా రూపుదిద్దుకుంటాయి. ఆయా రంగు, రూపాలకి వున్న ఆకర్షణ వీక్షించే దృష్టిని బట్టి, యోచించే మనసును బట్టి వాటిలోని జీవకళ, భావుకత, ఆర్ద్రత మనసును, కళ్ళను కట్టిపడేస్తుంది. అదే... చిత్రకళ. కళ ఏ రూపంలో వున్నా... అది నిత్యజీవన స్రవంతి. ప్రజలను చైతన్యపరుస్తూనే వుంటుంది. సమకాలీన సమాజ స్థితిగతులకు నిలువెత్తు దర్పణం చిత్రకళ. కళా ప్రయోజనం కేవలం ఆనందానికి, సౌందర్యానికే పరిమితం కాదు. హృదయాలను కదిలించి, సమస్యలను ప్రతిబింబించి, ఆలోచనలను రేకెత్తించి... పోరాడే ప్రేరణనిస్తుంది. సమస్యలను చూపడమే కాదు... పరిష్కారాల బాటలు కూడా వేయగలదు. చరిత్రలోని వాస్తవాలను కనుల ముందుకు తీసుకురాగలదు. మానవ అనుభవంలో కళకు చాలా ముఖ్యమైన పాత్ర వుంది. ప్రపంచంలోని మొదటి రికార్డులన్నీ పుస్తకాలలో రాయలేదు. చిత్రాలు, శిల్పాలు, సంగీతం రూపంలోనే నిక్షిప్తం చేయబడ్డాయి. ఇవి గతానికి సంబంధించిన ప్రపంచ చిత్రాన్ని చిత్రించడానికి సహాయపడ్డాయి. మనిషిలో ఆవేశం, ఆర్ద్రత వున్నంతకాలం రసాలూరే భావాలకు కొరత వుండదు.

చిత్రకళ ప్రాచీన నాగరికతకు... ప్రస్తుత కాలానికి మధ్యగల వైరుధ్యాన్ని ప్రతిబింబించే ఒక అందమైన కళాస్రవంతి. వివిధ సంస్కృతులు, సంప్రదాయాల కలయికకు నిలువుటద్దం. ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కనిపించని కథలన్నిటికీ రూపాన్నిచ్చిన ఘనత కళది. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు, ప్రభువెక్కిన పల్లకితో పాటు, అది మోసిన బోయీలు, గనిలో, వనిలో పోరాటాల్లో చిందించిన స్వేదం, పారించిన రుధిరం, హరప్పా, మొహంజొదారో గుహల్లోని చారిత్రక విభాగ సంధ్యల మానవ కథా వికాసాన్ని రూపుకట్టినది– చిత్రం, శిల్పం, సాహిత్యం. మనిషి తన భావాలను, భావనలను వ్యక్తీకరించగలిగిన నాటి నుంచి కళ ఉనికిలోకి వచ్చింది. మట్టిలో లేదా గోడలపై చెక్కబడిన, కళ మానవ నాగరికత ప్రధాన అంశం. ఇది సామాజిక, రాజకీయ ప్రభావాలను తెలియజేయడానికి, వర్ణించడానికి ఉపయోగించిన ప్రధాన మాధ్యమం. బల్బ్ నుంచి వరల్డ్ వైడ్ వెబ్ ఆవిష్కరణ వరకు ప్రపంచ చరిత్రను మలుపు తిప్పి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చినట్లే... పదివేల సంవత్సరాల ఉనికిలో కళ కూడా దాని ఔన్నత్యాన్ని, ఔచిత్యాన్ని ప్రదర్శిస్తూనే వచ్చింది. చరిత్రలోని అనేక ముఖ్యమైన ఘట్టాలు చిత్రం, శిల్పం, ఆట, పాట, మాట ఆవిష్కృతమయ్యాయి.

జీవితపు విలువల్లో మార్పులొస్తున్నా, జీవన విధానాల్లో వైరుధ్యాలు పెరుగుతున్నా... ఆలోచించే మనసు చుట్టూ మాత్రం ఎవ్వరూ అడ్డుగోడలు కట్టలేరు. కళ అంటేనే చైతన్యం. అది నవనవోన్మేషం. స్తబ్దత కళను నిర్వీర్యం చేస్తుంది. ఎప్పటికప్పుడు కళలో కొత్తనీరు వచ్చి చేరుతుండాలి. లేకపోతే, పాత నీరు పాచికట్టి అనారోగ్యానికి దారితీస్తుంది. కళకు ఆ పరిస్థితి రాకుండా ముందుగానే గుర్తించి, కళలో కొత్తదనాన్ని, ప్రజాకోణాన్ని ప్రవేశపెట్టాలి. రూపం ఏదైనా కావొచ్చు. కళ కళ కోసం, కాసుల కోసం కాదు, కళ ప్రజల కోసం, వారి అభ్యున్నతి కోసం అన్న సాంస్కృతికోద్యమ ఆశయాన్ని మరింత ముందుకు తీసుకుపోయి, సమ సమాజ స్థాపన కోసం జరిగే పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించేది కళ. ఈ కళ ప్రపంచంపై చూపిన అద్భుత ప్రభావాన్ని భవిష్యత్తరాలకూ అందించాలి. అనేకానేక సృజనశీలురు తయారయ్యేందుకు ఊతమివ్వాలి. ఆ ఉద్దేశంతోనే అక్టోబర్ 25ను 'అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం'గా పాటించాలని నిర్ణయించారు. సమాజ క్రమాన్ని ప్రజాకోణంలో రంగులద్దగల ప్రతి స్రష్ట వైతాళికుడవుతాడు. 'కాదేదీ కవితకనర్హం' అన్నట్లు– పల్లె సంస్కృతి, రైతు జీవనం, ప్రజా ఉద్యమం, అణచివేత...ఏదైతేనేం, ఈ భావనలకు రూపుదిద్ది, రంగులద్ది చైతన్యాన్ని రగిలిస్తాడు చిత్రకారుడు. కవి, రచయిత, గాయకుడు, శిల్పి... కళ ఏదైనా అది ప్రజా ప్రయోజనం అయినప్పుడు ఆ కళకొక పరమార్థం దక్కుతుంది.

మహనీయుల మాట

నా దేశ సోదరులారా! మీరు మొదట భారతీయులు. ఆ తర్వాతే వివిధ మతాలవారు. మీరే మతం వారైనప్పటికీ పరస్పరం కలహించుకోకండి. ఐకమత్యంతో ఆంగ్లేయులను ఎదిరించండి. దేశ విముక్తే మన లక్ష్యం కావాలి.

అష్ఫాకుల్లా ఖాన్,
భారత స్వాతంత్ర్య సమరయోధుడు.

22.10.1900 - 19.12.1927

చంద్రబాబు కేసులు, తెలుగు రాష్ట్రాల రాజకీయాలు

ప్రస్తుతం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఫైబర్‌నెట్ స్కాం కేసులో దాఖలు చేసుకున్న ముందస్తు బెయిలు పిటిషన్‌ను సుప్రీం కోర్టు నవంబర్ తొమ్మిదో తేదీకి వాయిదా వేయడం ఊహించిన పరిణామమే. స్పష్టంగా తెలియకపోయినా ఇది త్వరగా ఒక కొలిక్కి రాబోదని మాత్రం అందరూ భావించారు. ఇప్పటి వరకూ ఎసిబి కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు మూడు చోట్ల కూడా న్యాయమూర్తుల ఆదేశాలు, స్పందనలూ ఆ విధమైన సంకేతాలిస్తున్నాయి. వాస్తవానికి మొదట్లోనైతే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అరెస్టు తర్వాత మాట్లాడుతూ కాస్త ముందు వెనకగా బెయిలు వచ్చేస్తుందన్నట్టే వ్యాఖ్యానించారు. సిద్ధార్థ లూద్రా వంటి ప్రసిద్ధ అడ్వకేట్ ఎసిబి కోర్టుకు వచ్చి వాదించాక ఇక తిరుగు వుండదనీ చాలామంది అనుకున్నారు. జగన్ ప్రభుత్వం ఆయనను పదమూడు రోజులైనా కస్టడీలో వుంచాలని కక్షగా వుందని, అది తీరిపోతే పర్వాలేదని లెక్కలేశారు. అయితే ఆ అంచనాలేవీ ఆచరణలో నిజం కాలేదు. ఈ క్షణంలోనైతే చంద్రబాబుపై వున్న కేసుల భవిష్యత్తు అనిశ్చితంగానే వుంది. నవంబరు 9న కూడా విచారణ జరిగేది ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిలు గురించే. 8వ తేదీన క్వాష్ తీర్పు వస్తుందనే అంచనా వుంది. మేము రిజర్వు చేసిన ఆ తీర్పు వచ్చాక ఈ ఫైబర్ కేసు తీసుకుంటే బావుంటుందని జస్టిస్ అనిరుధ్ బోస్ అనడం కూడా అందుకు అవకాశమిస్తున్నది. ఏమైనా చంద్రబాబు నాయుడు అరెస్టు విచారణల తీరుతెన్నులు ప్రధానంగా ఎ.పి రాజకీయాలలోనే గాక తెలంగాణలోనూ ఒకింత చర్చనీయంగా మారాయి.



తెలకపల్లి రవి



> **సాల్వే తన చివరి వాదనల్లో 17ఎ చంద్రబాబుకు మాత్రమే గాక స్కిల్ కేసు నిందితులైన అధికారులందరికీ వర్తిస్తుందని చెప్పడం, అది వర్తిస్తే జరిగిన దర్యాప్తు మొత్తం నిలవదని వాదించడం గమనించదగింది. స్కాం అంటూ ఆరోపణలు వచ్చినపుడు మొత్తం వదిలేస్తే ఎలా అన్నట్టు న్యాయమూర్తుల కొన్ని ప్రశ్నలుండటం గమనించదగింది. అవినీతి నిరోధక చట్టంలో ఒక అంశాన్ని చూపి ఆపితే అసలు అవినీతి నిరోధం అన్న మౌలిక లక్ష్యం దెబ్బ తింటుందని కూడా వ్యాఖ్యానించారు. సాంకేతికంగా 17ఎ వర్తింపు గురించి రోహత్గీని కూడా అంతే నిశితంగా ప్రశ్నించారు. చివరకు తీర్పు ఎలా వుంటుందనే దానిపై ఎవరి అంచనాలు, ఆశలు వారికి వున్నా అవినీతి కేసుల పేరిట మోడీ హయాంలో చాలా చోట్ల హడావుడి జరుగుతున్న పరిస్థితుల్లో దీన్ని కూడా సుప్రీం కోర్టు తేలిగ్గా తీసుకోకపోవచ్చన్న అభిప్రాయం కూడా వుంది. బెయిల్ కోసం ప్రయత్నించే బదులు 17ఎ పైనే కేంద్రీకరించాల్సింది కాదని, క్వాష్ ఈ దశలో చెల్లదని కూడా అభిప్రాయాలున్నాయి.**

రెండు వైఖరులు

ప్రాథమికంగా ఈ విషయంలో రెండు వైఖరులు వున్నాయి. ఏదైనా ఆరోపణ వుంటే మామూలుగా అరెస్టు చేసి విచారించవచ్చుగానీ రాజకీయ కక్షతో రాత్రిపూట ఎక్కడో అరెస్టు చేయడం, వరుస కేసుల ఉచ్చు పన్నడం సరికాదన్న అభిప్రాయం అందరిలోనూ వుంది. దేశవ్యాపితంగానూ ఎక్కువమంది ఇదే భావం వెలిబుచ్చారు. అసలు తప్పు జరగనేలేదు, అన్నీ అభూత కల్పనలేనన్న తెలుగు దేశం వాదన మరొకటి. రాజకీయాభిప్రాయాలు ఎలా వున్నా ఎసిబి కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకూ విచారణ ప్రక్రియలో పాలుపంచుకున్న కొద్దీ తీర్పులను బట్టి నిర్ణయాలు వుండే పరిస్థితి సహజంగా వస్తుంది. ఎందుకంటే కేసులు కోర్టుల్లో వున్నప్పుడు నిర్దోషిగా విడుదల చేయాలనే నినాదం ఇతరుల నుంచి వచ్చే అవకాశం వుండదు. గతంలో జగన్ పైన వున్న కేసులతో పోల్చి చూడడం కూడా రాజకీయ విమర్శలవరకూ చెల్లుతుంది గాని చట్టపరంగా నిలిచేది కాదు. మరోవైపున జైలు అధికారుల తీరు, చంద్రబాబు ఆరోగ్యంపై ఫిర్యాదులు వీటిని ప్రజాస్వామిక ప్రమాణాలతోనూ మానవీయంగానూ పరిశీలించి చక్కదిద్దడం అవసరమవుతుంది. ఎసిబి కోర్టు వైద్య నివేదికలు కోరడం, ములాఖత్‌లను పెంచడం వంటివి ఆ విధంగా వచ్చిన చర్యలే. ఇప్పుడు హైకోర్టు వెకేషన్ బెంచి ఆయన ఆరోగ్య సంబంధమైన వాదనలను విచారించే అవకాశముంది. ఇవన్నీ కోర్టుల్లో జరుగుతుంటే బయిట వైసిపి నాయకులు, మంత్రులు దాడి చేయడం మరోవైపున టిడిపి నేతలు ఏ పొరబాటూ లేదని రకరకాలుగా వాదించడం ఆ రెండు పార్టీల తగాదాలో భాగమే. టిడిపి నిరసనలను అడ్డుకోవడం, ముందస్తుగా గృహ నిర్బంధాలు అరెస్టులు చేయడం ప్రజాస్వామిక పద్ధతి కానే కాదు.

తనను అరెస్టు చేస్తారని బహిరంగంగా చెబుతూ వచ్చిన చంద్రబాబు ముందస్తు కోసం ఎందుకు ప్రయత్నించ లేదనే సందేహాలు, వాటికి చాలా సమాధానాలు వున్నాయి. క్రిమినల్ కేసు గనక బెయిలు రాదనే మాట ఒకటైతే సిఐడి పెట్టిన సెక్షన్లు కూడా ముందస్తుకు అవకాశమిచ్చేలా లేవని న్యాయనిపుణులు కొందరు చెప్పారు. చంద్రబాబు లాయర్లు ఎసిబి కోర్టు కస్టడీ ఇచ్చాక కూడా బెయిల్ గాకుండా గృహ నిర్బంధం కోరారు. బెయిలు కోసం హైకోర్టుకు వెళ్లడం గాక క్వాష్ పిటిషన్ వేసి మొత్తంగా ఆయనను తప్పించాలని కోరారు. ప్రభుత్వ సేవకులపై చర్య ప్రారంభించే ముందు పైఅధికారి అనుమతి తీసుకోవాలని చెప్పే సెక్షన్ 17ఎ అమలు చేయలేదనే పాయింటుపైనే వాదించారు సిద్ధార్థ లూద్రా. హైకోర్టులో దాన్ని కొట్టివేశాక సుప్రీం కోర్టులోనూ అదే కొనసాగిస్తున్నారు. ఇందులో ఇతర బహుముఖ ప్రయోజనాలు వుండొచ్చు. దీనిపై ఇప్పటికే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. 2018లో స్కిల్ కేసు విచారణ ప్రారంభించే నాటికి 17ఎ లేదని, అసలు నేరాలు జరిగాయంటున్నది 2015–16లో గనక అది అసలే వర్తించబోదని ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెప్పారు. 17ఎ కింద గవర్నర్ అనుమతి తీసుకోవడం అనేది నిజాయితీపరుల కోసం ఏర్పాటు చేసిన ఒక ముందు జాగ్రత్త తప్ప అవినీతికి రక్షణ ఛత్రం కాదని ప్రభుత్వం తరపున తదితరులు వాదించారు. హైకోర్టులో దీనిపై క్వాష్‌ను కొట్టివేసిన జస్టిస్ శ్రీనివాసరెడ్డి కూడా అవినీతి చట్టం 17ఎ వర్తింపు ఎలా వున్నా ఇతర ఐపిసి సెక్షన్ కింద వున్న అభియోగాలనైనా విచారించాలని చెప్పారు.

సుప్రీంలో వాదనలు

ప్రభుత్వాలు కక్ష సాధింపునకు పాల్పడకుండా నిరోధించడం కోసమే 17ఎ ఏర్పాటైందని సిద్ధార్థ లూద్రా, హరీష్ సాల్వే పలుసార్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికార విధి నిర్వహణలో భాగంగా చేసిన వాటిపై దర్యాప్తు చేసేప్పుడు గవర్నర్ అనుమతి తీసుకోలేదు గనక అరెస్టు, తర్వాత రిమాండు ఉత్తర్వు చెల్లవనీ అప్పుడు కేసు నిలవదనీ వారు వాదించారు. చంద్రబాబుకు సంబంధం లేదంటూనే ఆయన విధి నిర్వహణలో భాగంగా చేశారని చెప్పడం ఎలా పొసుగుతుందని రోహ్తగీ ఎదురువాదన చేశారు. అవినీతి కేసులతో పాటు ఐపిసి సెక్షన్లు కూడా వున్నాయి గనక వాటికోసమైనా ఎసిబి కోర్టు విచారించవలసి వుంటుందని హైకోర్టు చెప్పిన సంగతి గుర్తుచేశారు. ఈ విచారణ చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే కేంద్రం ప్రారంభించింది కనుక కక్ష సాధింపు ఆరోపణ అర్థం లేదనీ ఆయన సమర్థించారు (అది జిఎస్‌టి ఎగవేతకు సంబంధించిందేగానీ స్కిల్‌స్కామ్ కాదన్నది చంద్రబాబు లాయర్ల వాదన). 17ఎ తో సమానమైన 6ఎ ఢిల్లీ స్పెషల్ పోలీస్ యాక్ట్ (సిబిఐ) విషయంలో గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తమకు అనుకూలంగా వుందని రోహత్గీ ఉదహరించారు. 17ఎ సవరణ చేసేప్పుడు ఇది గతకాలానికి కూడా వర్తిస్తుందని నిర్దిష్టంగా పేర్కొనలేదని మరో వాదన తీసుకొచ్చారు. కానీ అసహజ శృంగారం విషయంలో 377 సెక్షన్‌ను సవరించిపుడు అది గతంలో వున్న అలాంటి కేసులకు కూడా వర్తిస్తుంది కదా అని కోర్టు ప్రశ్నించినపుడు దాని స్వభావం వేరని రోహత్గీ వివరించారు. ఫెరా, ఫెమా చట్టాలు మారినా పాత తప్పులు అలాగే వుంటాయన్న ఉదాహరణ ఇక్కడ వర్తిస్తుందన్నారు. ఒక నేరం జరిగిన తర్వాత చట్టం మారినా మౌలికంగా నేరం మాసిపోదన్నారు. రాఫెల్ కేసులో సుప్రీం కోర్టు స్వయంగా 17ఎ వెనకటి కాలానికి కూడా వర్తిస్తుందని చెప్పినట్టు సాల్వే చెబితే అది కేవలం జస్టిస్ జోసఫ్ ఒక్కరి అభిప్రాయం మాత్రమేననీ, మిగిలిన ఇద్దరూ ఆ ప్రస్తావనే తేలేదని రోహత్గీ తెలిపారు. తాజాగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అక్రమాస్తుల కేసులోనూ 17ఎ వర్తించబోదని హైకోర్టు చెప్పిన తీర్పును ఉంటంకించారు. అదే ఎడియూరప్ప విషయంలో గవర్నర్ అనుమతి నిరాకరించినా సిబిఐ చర్య తీసుకుంది. కానీ 17ఎ వర్తిస్తుందని సుప్రీం కోర్టు ఉపశమనం కలిగించింది.

రెండు రాష్ట్రాలపై ప్రభావం

క్వాష్‌పై తీర్పు ఇచ్చిన తర్వాత ముందస్తు బెయిల్ కేసు దీన్ని వింటే బావుంటుందని జస్టిస్ బోస్ సూచించగా అప్పటి వరకూ అరెస్టు చేయకుండా గతంలో వున్న అవగాహనను కొనసాగించాలని లూద్రా కోరారు. ఇప్పటికే మరోకేసులో కస్టడీలో వున్నవారి విషయంలో మిగిలిన కేసులు కూడా అమలులోకి వస్తాయనీ, సాంకేతికంగా ముందస్తు బెయిలు అమలయ్యే అవకాశమే వుండదని ప్రభుత్వం తరపున రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. నవంబరు 8 వరకూ ఆగడానికి సిద్ధమేకానీ ఇప్పటికే వాటిపై ఎసిబి కోర్టు ముందు విచారణ జరుగుతున్నదని తెలిపారు. లూద్రా అభ్యర్థనపై 9వ తేదీకి కేసు విచారణ వాయిదా పడింది. ఈ లోగా ఆరోగ్యం విషయమై హైకోర్టు వెకేషన్ బెంచి గనక ఏదైనా ఉపశమనం ఇచ్చే అవకాశం మాత్రం ఇంకా వుంది. ఈ కొద్దిరోజుల వ్యవధిలో హైకోర్టు వెకేషన్ బెంచి ఆ విధమైన వైఖరి తీసుకుంటుందా అనేది చూడవలసిందే. సాల్వే తన చివరి వాదనల్లో 17ఎ చంద్రబాబుకు మాత్రమే గాక స్కిల్ కేసు నిందితులైన అధికారులందరికీ వర్తిస్తుందని చెప్పడం, అది వర్తిస్తే జరిగిన దర్యాప్తు మొత్తం నిలవదని వాదించడం గమనించదగింది. స్కాం అంటూ ఆరోపణలు వచ్చినపుడు మొత్తం వదిలేస్తే ఎలా అన్నట్టు న్యాయమూర్తుల కొన్ని ప్రశ్నలుండటం గమనించదగింది. అవినీతి నిరోధక చట్టంలో ఒక అంశాన్ని చూపి ఆపితే అసలు అవినీతి నిరోధం అన్న మౌలిక లక్ష్యం దెబ్బ తింటుందని కూడా వ్యాఖ్యానించారు. సాంకేతికంగా 17ఎ వర్తింపు గురించి రోహత్గీని కూడా అంతే నిశితంగా ప్రశ్నించారు. చివరకు తీర్పు ఎలా వుంటుందనే దానిపై ఎవరి అంచనాలు, ఆశలు వారికి వున్నా అవినీతి కేసుల పేరిట మోడీ హయాంలో చాలా చోట్ల హడావుడి జరుగుతున్న పరిస్థితుల్లో దీన్ని కూడా సుప్రీం కోర్టు తేలిగ్గా తీసుకోకపోవచ్చన్న అభిప్రాయం కూడా వుంది. బెయిల్ కోసం ప్రయత్నించే బదులు 17ఎ పైనే కేంద్రీకరించాల్సింది కాదని, క్వాష్ ఈ దశలో చెల్లదని కూడా అభిప్రాయాలున్నాయి.

ఈ మధ్యలో లోకేశ్ హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయినా కేంద్రం చేసిందేమీ లేదు. నిజానికి కేంద్రం ఆశీస్సు లేకుండా చంద్రబాబు అరెస్టు జరిగి వుండదని అత్యధికుల భావన. ఏ విధంగా చూసినా న్యాయపరంగానూ రాజకీయంగానూ చంద్రబాబుకూ తెలుగుదేశం పార్టీకి ఇది పెద్ద సవాలు. దీనిపై నిరసనల గురించి తెలంగాణలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. ఎన్నికల రీత్యా నెమ్మదిగా బిఆర్‌ఎస్ కూడా గొంతు కలిపిన సందర్భాలున్నాయి.

ఇతర దేశాల్లో రాష్ట్రాల్లో నిరసనల గురించి వార్తలు వస్తున్నా ఎ.పి లో టిడిపి ఆశించిన స్థాయిలో లేదనే వ్యాఖ్యలు వచ్చాయి. ఈ మధ్యలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఎన్నికల పొత్తు ప్రకటించినా నిరసనల్లో పాత్ర వహించింది తక్కువ. త్వరలో ఆ రెండు పార్టీల సమావేశంలో కార్యక్రమం నిర్ణయం కావచ్చు. టిడిపి సీనియర్ నాయకుల కన్నా చంద్రబాబు కుటుంబ సభ్యులే ముందుండటం కొన్ని రాజకీయ సంకేతాలిస్తున్నది. బిజెపిపైన టిడిపి పెట్టుకున్న ఆశలు కూడా నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు, సిఐడి అరెస్టులో కక్ష సాధింపు వున్నా...కేసులు, కోర్టులు విచారిస్తున్నందున తీర్పు కోసం చూడటం అనివార్యం.

★

శ్రామిక మహిళకు కూర్చునే హక్కు!

సమస్య

రాష్ట్రంలో పండుగ సీజన్ మొదలైంది. అక్టోబర్‌లో దసరాతో మొదలై...నవంబర్‌లో దీపావళి, డిసెంబర్‌లో క్రిస్మస్, జనవరిలో సంక్రాంతితో ముగుస్తుంది. ఈ నాలుగు నెలలు ఆఫర్లతో, డిస్కౌంట్లతో మోత మోగించేస్తున్నారు. భారీ షాపింగ్ మాల్స్‌లో వ్యాపారాలు జోరుగా సాగిపోతున్న కాలమిది. ధమాకా ఆఫర్లతో, చిరునవ్వుతో కస్టమర్లకు వంగి, వంగి నమస్కారాలు చేస్తూ, ఆహ్వానాలు పలికే శ్రామిక మహిళలు మనకు కనిపిస్తుంటారు. ఆ రంగు, రంగుల దీపకాంతుల వెనుక, ఆ నవ్వుల వెనుక ఎంతటి విషాదం ఉందో తెలిస్తే మనసున్న వారెవరికైనా హృదయాలు బరువెక్కక మానవు. ఊరంతా పండుగే, దేశమంతా పండుగల సంబరాలే కానీ ఆ మాల్స్‌లో పని చేసే సగటు మహిళలు...పండుగ రోజుల్లో కుటుంబంతో కలిసి భోంచేసి ఏళ్లయిందని చమర్చిన కళ్లతో వివరిస్తారు. పండుగలన్నవి మరచిపోయామని వారు వివరిస్తారు.

ఎవరు వీరు? వీరి కష్టమేంటి!?

తోడేళ్లలాగా తనిఖీ చేసే సూపర్‌వైజర్లు, యాజమాన్యపు సిబ్బంది నిఘా మధ్య కుక్కిన పేనుల్లా పనులు చేసుకుపోయే శ్రామిక మహిళల్ని షాపింగ్ మాల్స్, బట్టల షాపులు, పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో చూస్తుంటాం. ఈ మహిళలు ఎప్పుడు మనం షాపింగ్‌కు వెళ్లినా నిలబడుకునే కనిపిస్తారు. పక్కన కనీసం కూర్చోవడానికి స్టూలుకానీ, కుర్చీ కానీ కనపడదు. ఇవేవీ మనకు పట్టదు. ఉదయం 9 గంటలకు డ్యూటీకి వచ్చింది మొదలు రాత్రి 9 గంటలకు డ్యూటీ దిగేంత వరకు సుమారు 12 గంటల పాటు కంటిన్యూగా నిలబడే ఉండాల్సిన ఉద్యోగం వారిది. ఇప్పటికైనా అర్థం అయిందా? వారి కష్టం ఏమిటో?

కందారపు మురళి

మహిళలు షాపింగ్‌మాల్స్‌లో కూర్చునే హక్కును కల్పిస్తూ దేశంలో మొట్టమొదటిసారిగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. ఆ తరువాత తమిళనాడు ప్రభుత్వం కూర్చునే హక్కును కల్పిస్తూ చట్టం చేసింది. కేరళ చట్టంలో ప్రతి కార్మికునికి వారానికి ఒకరోజు సెలవుదినంగా ఇవ్వాలని, మహిళా కార్మికులను రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు పని చేయించరాదని పేర్కొన్నది. తప్పనిసరి పరిస్థితులు ఎదురైనప్పుడు ఐదుగురు కార్మికులు ఓ గ్రూపుగా ఉండాలి. అందులో ఇద్దరు మహిళలు ఉండాలి. వారికి తగిన రక్షణ కల్పించాలి. ఇంటి వరకూ రవాణా సౌకర్యం కల్పించాలని చెప్పబడింది. షాపుల్లో నిలబడి పని చేసే వారికి వారి పని ప్రదేశాలలో కూర్చోవటానికి సౌకర్యం కల్పించాలని స్పష్టంగా చట్టంలో వివరించబడింది. మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఇది హక్కుగా, చట్టంగా లేకపోవడం విచారకరం. తక్షణం ఈ సమస్యపై రెండు ప్రభుత్వాలు చట్టం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

> **షాపింగ్‌మాల్స్‌లో పనిచేసే మహిళలకు కూర్చునే హక్కును కల్పిస్తూ దేశంలో మొట్టమొదటిసారిగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. ఆ తరువాత తమిళనాడు ప్రభుత్వం కూర్చునే హక్కును కల్పిస్తూ చట్టం చేసింది. తరువాత దేశంలో ఎక్కడా ఇది చట్టంగా రూపుదాల్చలేదు. మహిళోద్ధారకులుగా తమను తాము కీర్తించుకునే జగన్, కేసిఆర్‌లకు ఈ సమస్య పట్టడంలేదు. విజయవాడ, విశాఖ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ లాంటి నగరాలలో వీరి సంఖ్య వేలల్లో ఉంటుంది. ఒక్కో ప్రాంగణంలో వేయి నుంచి రెండు వేల మంది పని చేస్తున్న సంస్థలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో శ్రామిక మహిళలు పని చేస్తున్న ఇంత పెద్ద వ్యవస్థలో చట్టాలు అమలవుతున్నాయా? లేదా? అన్న ప్రాథమిక పరిశీలన కూడా ప్రభుత్వాలు చేయకపోవటాన్ని ఓ నేరంగా భావించాలి. ఓ రకంగా చెప్పాలంటే ఇందులో పని చేస్తున్న మహిళల కనీస హక్కులు హరించబడుతున్నాయి.**



మారుతున్న జీవన సరళి, నూతన ఆర్థిక విధానాల ప్రభావం, ప్రజల్లో పెరుగుతున్న వినియోగదారీ తత్వం కారణంగా పెద్ద నగరాలకు పరిమితమైన షాపింగ్‌మాల్స్ చిన్న పట్టణాలకు సైతం వ్యాపిస్తున్నాయి. ఈ రంగంలో చదువుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చి ఈ పనులలో అత్యధికులు చేరుతున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో రిలయన్స్, డీ–మార్ట్, సిటీమార్ట్, బిగ్ బజార్, బ్రాండ్ ఫ్యాక్టరీ, శుభమస్తు, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఎంజిఆర్, పసుపర్తి, చందనా బ్రదర్స్, చందన రమేష్, అపూర్వ, కళానికేతన్, కంచి పెరుమాళ్ సిల్క్స్, సిఎంఆర్ వంటి షాపింగ్ మాల్స్‌తో పాటు పలు జ్యూవెలరీ మార్టులున్నాయి. వందల సంఖ్యలో మాల్స్, పెద్ద సంఖ్యలో ఇతర సంస్థలు పోటీ పడి ముందుకు వస్తున్నాయి. వేల నుంచి లక్షల సంఖ్యలో శ్రామికులు వీటిలో ఉపాధికై పని చేస్తున్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు ఇవ్వటం లేదు. గంటలకొద్దీ నిలబడటం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. అత్యధిక చోట్ల మహిళలకు కూర్చునే సౌకర్యం లేదు. కస్టమర్లు లేనప్పుడు కూడా కూర్చునేందుకు లేదు. తిరుపతి నగరంలో సిఐటియు కార్యకర్తల పరిశీలనలో దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. ఈ మహిళలకు నిలబడి ఉండటం కారణంగా మూత్రాశయ వ్యాధులు, కాళ్లపై వెరికోస్ వెయిన్స్ (నరాలు ఉబ్బటం) వ్యాధి, వెన్నుపూస, నడుమునొప్పి వంటి సమస్యలు చిన్న వయసులోనే వస్తున్నాయి.

శుభమస్తు షాపింగ్ మాల్స్‌లో 10 నిమిషాలు మాత్రమే వాష్‌రూమ్‌కు వెళ్లాలనే నిబంధన ఉంది. బాత్‌రూమ్‌కు వెళ్లిన ప్రతిసారి బయోమెట్రిక్‌లో నమోదు చేయాలి. చందనలో కస్టమర్లు లిఫ్ట్‌లో వస్తారు. కార్మికులు లిఫ్ట్ ఎక్కడానికి వీలు లేదు. ఎన్ని సార్లయినా, ఎన్ని అంతస్తులైనా మెట్లపై నడవాల్సిందే. పీరియడ్స్ సమయంలో మహిళల బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. కార్మికులకు భోజనాలు చేయడానికి సౌకర్యాలు లేవు. టాప్‌ఫ్లోర్‌లో వాష్‌రూముల దగ్గర భోజనాలు చేస్తుంటారు. వంటరి మహిళలు, పెళ్లికానివారు, ఇంటిని పట్టించుకోని భర్తలున్న మహిళలు అనివార్యమై కుటుంబ భారాన్ని మోస్తున్నట్టుగా ఈ సర్వేలో వెల్లడైంది. పిల్లల రక్షణ, వారి భవిష్యత్తుపై వీరికి తీవ్ర ఆందోళన ఉంది. కుటుంబానికి సమయం ఇవ్వలేక పోతున్నామన్న బాధ వీరిలో కనిపిస్తుంది. ఇక ఒంటరి మహిళల బాధ చెప్పనలవి కాదు. పిల్లలు ఎలా పెరుగుతున్నారో పరిశీలన చేసే అవకాశం తమకు లేదని వాపోతున్నారు.

మహిళలకు, పురుషులకు వేతన వ్యత్యాసం ఉంది. ఎన్నేళ్లయినా ఒకే రకమైన పనులు చేయాలి. దీంతో మనుషులు యాంత్రికం గా తయారవుతున్నారు. ప్రమోషన్లు లేవు. వర్కర్లతోపాటు ఈ రంగంలో హెల్పర్లు పని చేస్తున్నారు. వీరికున్న సమస్యలు వర్కర్ల కంటే ఎక్కువగా ఉన్నాయి. పని ఎక్కువ, వేతనం తక్కువ. కొనుగోలుదార్లు చూసిన బట్టలు, వస్తువులను సర్దటమే వీరి ప్రధాన పని. రూ.6 వేల నుంచి 14 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. పెద్ద మాల్స్‌లో కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్‌లు అమలు చేస్తున్నా పని గంటలు చట్ట ప్రకారం అమలు చేయటం లేదు. కార్మికులకు ప్రోత్సాహకాలు, బోనస్ పేరుతో పోటీ పెంచుతున్నారు. ఒక్కో అంతస్తులో ప్రతి రోజూ 'మంచి ఉద్యోగి' పేరిట ఎంపిక చేస్తారు. ఇందుకోసం అమ్మకాలు పెంచాలంటూ విపరీతమైన టార్చర్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా 8 గంటల పని విధానం అమలు కావటం లేదు. 10 నుంచి 12 గంటలపాటు కనీసంగా వీరు పని చేయాల్సి వస్తున్నది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు రోజులో రాక పోకలు కలుపుకుంటే 14 నుంచి 16 గంటలు ఈ పనిలో ఉండాల్సి వస్తున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెలవులు అమలు కావటం లేదు. ఒక్కరోజు సెలవు తీసుకుంటే రెండు రోజుల వేతనాన్ని కత్తిరిస్తున్నారు.

కేరళ, తమిళనాడు తరువాత దేశంలో ఎక్కడా ఇది చట్టంగా రూపుదాల్చలేదు. మహిళోద్ధారకులుగా తమను తాము కీర్తించుకునే జగన్, కేసిఆర్‌లకు ఈ సమస్య పట్టడంలేదు. విజయవాడ, విశాఖ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ లాంటి నగరాలలో వీరి సంఖ్య వేలల్లో ఉంటుంది. ఒక్కో ప్రాంగణంలో వేయి నుంచి రెండు వేల మంది పని చేస్తున్న సంస్థలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో లక్షల సంఖ్య లో శ్రామిక మహిళలు పని చేస్తున్న ఇంత పెద్ద వ్యవస్థలో చట్టాలు అమలవుతున్నాయా? లేదా? అన్న ప్రాథమిక పరిశీలన కూడా ప్రభుత్వాలు చేయకపోవటాన్ని ఓ నేరంగా భావించాలి. ఓ రకంగా చెప్పాలంటే ఇందులో పని చేస్తున్న మహిళల కనీస హక్కులు హరించబడుతున్నాయి.

పని ప్రదేశంలో లైంగిక వేధింపుల సమస్య కూడా తీవ్రమైన అంశంగా ఉంది. 2013 లైంగిక వేధింపుల నిరోధక చట్టం అనుసరించి మాల్స్‌లో ఎక్కడా అంతర్గత కమిటీలు లేవన్న వాస్తవం ఈ పరిశీలనలో వెల్లడైంది. తక్షణం ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రభుత్వాలు ఎన్నికల తరుణంలోనైనా వీరి సమస్యలకు పరిష్కారాన్ని చూపించాల్సిన బాధ్యత ఉంది.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు,
సెల్ : 94900 98840 /

నివాళి

సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా...

జీవితమంతా ప్రజలకు నిబద్ధులై ఉండే అధికారుల గురించి ఆలోచిస్తే మొట్టమొదట మన కళ్ళ ముందు కదలాడే రూపం ఎస్.ఆర్. శంకరన్‌దే. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి. రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, ప్రభుత్వ పాలనా విభాగాలేవైనా సరే వారి ప్రథమ కర్తవ్యం అణగారిన వర్గాల సమస్యల పరిష్కారమే అని నమ్మి ఆచరించిన వ్యక్తి. ఎస్.ఆర్.శంకరన్‌గా ప్రసిద్ధిచెందిన సిరిగలత్తూర్ రామనాథన్ శంకరన్ తమిళనాడు లోని తంజావూరు జిల్లా సిరిగలత్తూరు గ్రామంలో 1934, అక్టోబర్ 22న జన్మించారు. నెల్లూరు జిల్లా కలెక్టరుగా, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పలు హోదాల్లో పనిచేసిన ఆయన 1992లో పదవీ విరమణ చేశారు. మన రాష్ట్ర ప్రభుత్వంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. పేదలు, దళితుల తరపున గట్టిగా వాదనను వినిపించేవారు. బొగ్గు గనులను జాతీయం చేయడంలోనూ, వెట్టి చాకిరిని నిర్మూలించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఆహార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో పోలీసు ఎన్‌కౌంటర్లు, నక్సల్ ప్రతి హింసల కారణంగా నెలకొన్న పరిస్థితులతో కలత చెందిన ఆయన శాంతియుత వాతావరణం ఏర్పడేందుకు కృషి చేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత జరిగిన శాంతి చర్చల్లో పనిచేసిన కాలంలోనే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మార్గదర్శకాలు, నిబంధనలు రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు ఊపిరి పోశారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో రూపకల్పన చేశారు. ఇలాంటి మహనీయుల ఆదర్శ భావాలను పుణికి పుచ్చుకొని పరిపాలనా వ్యవహారాల్లో వివక్షతలను విడనాడి సకల జనుల పురోభివృద్ధికి బాటలు వేయడం ఎంతైనా అవసరం.

– అట్లూరి రామారావు,
బహుజన రచయితల వేదిక మాజీ అధ్యక్షులు,
ప్రకాశం జిల్లా.
సెల్ : 7981079760

కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణహోమం

• నాలుగు వేలు దాటిన మరణాలు • ఆసుపత్రులపైనా బాంబు దాడులు • ఖాళీ చేయాలంటూ హుకుం • 16 మందికిపైగా ఐరాస సిబ్బంది మృతి



గాజా : ఇజ్రాయిల్ మారణహోమం కొనసాగుతోంది. దీంతో, పాలస్తీనాలోని గాజా తదితర ప్రాంతాలకు చెందిన పసికందుల నుంచి పండు ముదుసలి వరకూ ప్రాణాలు కోల్పోతున్నారు. 4,385మంది పాలస్తీనియన్లు మరణించినట్లు పాలస్తీనా రెడ్ క్రిసెంట్ సొసైటీ (పిఆర్‌సిఎస్) డైరెక్టర్ మార్వాన్ జిలానీ తెలిపారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, గాజాలో మరణించిన వారి సంఖ్య 4,137కు చేరుకుంది, వీరిలో 70 శాతం మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. వెయ్యిమంది గల్లంతయ్యారు. లేదా శిథిలాల కింద చిక్కుకున్నారు.

ఐరాస సంస్థలే లక్ష్యంగా వైమానిక దాడులు

ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న అంతర్జాతీయ మానవతా సంస్థలే లక్ష్యంగా నెతన్యాహు ప్రభుత్వం వైమానిక దాడులకు పాల్పడుతోంది. గత 24 గంటల్లో వైమానిక దాడుల్లో ఇద్దరు ఐక్యరాజ్యసమితి రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) సిబ్బంది హత్యకు గురయ్యారు. వైమానిక దాడుల్లో 16 మందికిపైగా ఐరాస సిబ్బంది మరణించారు. మృతుల సంఖ్య ఇంకా ఎక్కువ ఉండొచ్చునని ఐరాస పేర్కొంది. ఐరాస సంస్థల్లో ఇప్పటివరకూ ఇజ్రాయిల్ 33 వైమానిక దాడులకు పాల్పడింది. గాజాలో 14 లక్షల మంది శరణార్థులు ఉన్నారని ఐరాస అంచనా వేసింది. వారిలో ఐదు లక్షల మంది వరకూ ఐరాస ఏర్పాటు చేసిన అత్యవసర శిబిరాల్లో తలదాచుకున్నారు. ఒకవైపు బాంబు దాడులు చేయడంతోపాటు మరోవైపు ఆహారం, ఇంధనం, తాగునీరు గాజాలో ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారు. ఆహారం అందకపోవడం, ఆరోగ్య సమస్యల ద్వారా వారు మరణించేలా చేయాలని ఇజ్రాయిల్ ఎత్తుగడ వేస్తోంది. "గాజాపై పూర్తి ముట్టడి వరుసగా పదవ రోజు కొనసాగుతోంది. రఫా, కెరెమ్ షాలోమ్, ఎరెజ్ క్రాసింగ్‌లు మూసివేయబడ్డాయి, ఆహారం, నీరు, మందులు మరియు ఇంధనంతో సహా అత్యంత అవసరమైన మానవతా సహాయం ఇప్పటికీ ప్రవేశించేందుకు నిరోధించాయి." అని ఐక్యరాజ్యసమితి తెలిపింది.

30 శాతం నివాసాలు ధ్వంసం

గాజాలోని హౌసింగ్ మంత్రిత్వ శాఖ, ఐరాస తెలిపిన వివరాల ప్రకారం, గాజా స్ట్రిప్‌లోని 30 శాతం నివాసాలు గత రెండు వారాల్లో ధ్వంసమయ్యాయి. వేల మంది తమ నివాసాలను కోల్పోయారు. "బీట్ హనౌన్, బీట్ లాహియా, షుజాయ్, అబ్బాసన్ కబీరాతో సహా చాలా ప్రాంతాలు నాశనం చేయబడ్డాయి" అని ఐరాస పేర్కొంది.

శరణార్థుల శిబిరాలు, ఆసుపత్రులు లక్ష్యంగా బాంబు దాడులు

దాదాపు 400 మంది శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న గాజాలోని అత్యంత పురాతనమైన క్రిస్టియన్ చర్చిపై గురువారం ఇజ్రాయిల్ బాంబు దాడి చేసింది. ఈ దాడిలో కనీసం 18 మంది మరణించారు, మరో 18 మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. బాంబు దాడిలో తన కుటుంబ సభ్యులు మరణించారని అమెరికా మాజీ ప్రతినిధి జస్టిన్ అమాష్ శుక్రవారం వెల్లడించారు. ఇజ్రాయెల్ ఉత్తర గాజాలో వేలాది మంది ప్రజలు ఆశ్రయం పొందుతున్న క్రైస్తవ ఆసుపత్రిపై మంగళవారం బాంబు దాడి జరగడంతో దాదాపు 500 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

గాజా విద్యా మౌలిక సదుపాయాలు క్రమపద్ధతిలో కూల్చివేయబడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న 29 పాఠశాలలతో సహా దాదాపు 200 విద్యాసంస్థలు దెబ్బతిన్నాయి. విద్యుత్, మందులు, పరికరాలు, ప్రత్యేక సిబ్బంది కొరత కారణంగా ఆసుపత్రులు మూతపడేందుకు సిద్ధంగా ఉన్నాయి. 12,000 మందికి సేవలందిస్తున్న అల్-ఖుద్స్ ఆసుపత్రిని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ అధికారులు శుక్రవారం ఆదేశించారు, ఇది కూడా బాంబు దాడులకు లక్ష్యంగా ఉండవచ్చునని ఐరాస భావిస్తోంది. "తరలింపు సాధ్యం కాదు," అని పాలస్తీనియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీకి చెందిన నెబల్ ఫర్సాఖ్ అన్నారు. "ఇంటెన్సివ్ కేర్ యూనిట్ పిల్లలతో నిండి ఉంది. మేము వారి జీవితాన్ని కాపాడే వ్యవస్థలను తొలగించలేం' అని చెప్పారు. అల్-ఖుద్స్ ఆసుపత్రిని తరలించాలని ఆదేశించడం ఆందోళన కలిగిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సెక్రటరీ జనరల్ టెడ్రోస్ అథనామ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. "ఈ రద్దీ ఆసుపత్రులకు రోగులను సురక్షితంగా తరలించడం అసాధ్యం. వారి ప్రాణాలను రక్షించే విధులను నిర్వహించడానికి వారిని అనుమతించాలి. వారికి రక్షణ కల్పించాలి." అని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. "ఇజ్రాయెల్ దాడులు గాజాలోని మొత్తం కుటుంబాలను తుడిచిపెట్టడమే లక్ష్యంగా చేపట్టిన హేయమైన యుద్ధ నేరాలకు సాక్ష్యాలు ఉన్నాయి" అని గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ నేరాలపై గత వారం ఇచ్చిన ప్రాథమిక నివేదికలో, అమ్నెస్టీ పేర్కొంది.

గాజాలోకి పరిమిత సాయం !

• **20 ట్రక్కులతో ఆహారం, మందులు**

గాజా : ఇజ్రాయిల్ విధించిన అమానుషమైన ఆంక్షలు, దిగ్బంధనంతో ఆకలి కోరల్లో చిక్కుకున్న గాజా ప్రజల కోసం ఉద్దేశించిన ఆహార పదార్థాలు, మందులను తీసుకుని 20 రెడ్ క్రిసెంట్ ట్రక్కులు గాజాలో ప్రవేశించాయి. వీటిలో ఇంధనం లేదు. ఇబ్బందులు పడుతున్న ప్రజల సంఖ్యతో పోల్చుకుంటే ఈ 20 ట్రక్కుల సాయం ఏమూలకూ సరిపోదని సహాయక గ్రూపులు పేర్కొంటున్నాయి. ఈ ఘర్షణలను పరిష్కరించేందుకు ఈజిప్ట్ అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఒకపక్క యుద్ధాన్ని అంతమొందించేందుకు యత్నాలు జరుగుతున్నా ఇజ్రాయిల్ ఏమాత్రం పట్టించుకోకుండా గాజాపై బాంబు దాడులు సాగిస్తూనే ఉంది.

అంతర్జాతీయ చట్టాలను గౌరవించి, గాజాలో ప్రజల ప్రాణాలను కాపాడాలని బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లావర్లీ ఇజ్రాయిల్ మిలటరీ, ప్రభుత్వాలను కోరారు. కైరో శాంతి సదస్సులో ఆయన మాట్లాడారు. శాంతియుత సహజీవనమే అంతిమంగా విజయం సాధిస్తుందని అన్నారు.

రెండు దేశాల ఏర్పాటు దిశగా ప్రణాళిక

గాజాలో ఉద్రిక్త పరిస్థితులను నివారించేలా, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారం దిశగా ఒక ప్రణాళికను రూపొందించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఇటలీ, గ్రీక్ నేతలు కైరో శాంతి సదస్సులో అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. కొత్త శాంతి క్రమాన్ని ప్రారంభించాల్సిందిగా కూడా గ్రీక్ ప్రధాని కిరియాకోస్ మిత్సోతకిస్ పిలుపిచ్చారు. సుస్థిరమైన రాజకీయ పరిష్కారం మినహా మరే ఇతర మిలటరీ జోక్యాలు ఈ సమస్యను పరిష్కరించలేవని అన్నారు.

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

• **నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభం**

భోపాల్ : మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో, నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. నవంబర్ 17 న ఒకే దశలో ఇక్కడ ఎన్నికలు జరుగుతాయి.

230 మంది సభ్యులున్న రాష్ట్ర అసెంబ్లీకి జరిగే ఎన్నికలకు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 30 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, ఈ నెల 31న పరిశీలన జరుగుతుందని అధికారులు తెలిపారు. నవంబర్ 2 వరకు తమ నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలో 5.60 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. మొత్తం 5,60,60,925 మంది ఓటర్లలో, 2,88,25,607 మంది పురుషులు, 2,72,33,945 మంది మహిళలు, 1,373 మంది ఇతరులు థర్డ్ జెండర్‌కు చెందిన వారని అధికారులు తెలిపారు. చేర్పులు, తొలగింపుల తర్వాత మొత్తం 16,83,790 మంది ఓటర్లు జాబితాలో చేరినట్లు చెప్పారు. కాంగ్రెస్ 229 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, బిజెపి 136 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. 2018 ఎంపీ అసెంబ్లీ ఎన్నికల్లో 230 మంది సభ్యులున్న సభలో కాంగ్రెస్ 114 సీట్లు గెలుచుకోగా, బిజెపి 109 సీట్లు గెలుచుకుంది. ఎస్‌పి, బిఎస్‌పి, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో కమల్‌నాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను అస్థిరపరచడమే లక్ష్యంగా చేసుకున్న బిజెపి ఆపరేషన్ కమలం పేరుతో ఫిరాయింపులను ప్రోత్సహించింది. జ్యోతిరాదిత్య సింధియా, ఆయన అనుయాయులు బిజెపిలో చేరడంతో 15 నెలల తరువాత కమల్‌నాథ్ ప్రభుత్వం కూలిపోయింది. 2020 మార్చిలో శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా బిజెపి అధికారంలోకి వచ్చింది.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ తొలిజాబితా విడుదల

• **సదర్‌పుర నుంచే సిఎం గెహ్లాట్ పోటీ**

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన రెండు వారాలకు కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. మొత్తం 33 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఈసారి కూడా సదర్‌పుర అసెంబ్లీ స్థానం నుంచే బరిలో దిగనున్నారు. రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ టోంకు నియోజకవర్గం నుంచి, అసెంబ్లీ స్పీకర్ సిపి జోషి నత్‌ద్వారా అసెంబ్లీ స్థానం నుంచి, యువ నాయకురాలు దివ్య మాడెర్నా ఓసియన్ స్థానం నుంచి, పిసిసి అధ్యక్షుడు గోవింద్ సింగ్ దొతసారా లఛ్‌మన్‌గఢ్ అసెంబ్లీ స్థానం నుంచి, డిస్కస్ త్రో క్రీడాకారిణి, అంతర్జాతీయ టోర్నీలో గోల్డ్ మెడలిస్ట్ కృష్ణ పూనియా సాదుల్‌పూర్ నుంచి బరిలో దిగబోతున్నారు.

బిజెపి అభ్యర్థుల రెండో జాబితా విడుదల..

• **మళ్లీ ఝల్రాపటన్ నుంచే వసుంధరా రాజే**

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే మరో 83 మంది అభ్యర్థుల పేర్లతో ఆ పార్టీ రెండో జాబితాను బిజెపి విడుదల చేసింది. తొలి జాబితాలో 41 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే మరోమారు ఝల్రాపటన్ నియోజకవర్గం నుంచే బరిలో దిగునున్నారు. ఆమె 2003 నుంచి అదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. రాజస్థాన్ బిజెపి మాజీ అధ్యక్షుడు సతీష్ సుభాష్‌చంద్ర పూనియా అంబీర్ నుంచి, రాజస్థాన్ అసెంబ్లీలో బిజెఎల్‌పి నాయకుడు రాజేంద్ర రాథోడ్ తారానగర్ నుంచి, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బీజేపీలో చేరిన జ్యోతి మిర్ధా నాగౌర్ నుంచి పోటీ చేస్తున్నారు.

పాలస్తీనియన్లకు క్యూబా సంఘీభావం

హవానా : పాలస్తీనియన్లకు క్యూబా సంఘీభావం ప్రకటించింది. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా హయ్యర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌కి చెందిన విద్యార్థులు, కార్యకర్తలు హవానాలో సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సభలో క్యూబా రాయబారి, క్యూబా, అరబ్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమిలియో కాబలెరోతోపాటు క్యూబా విద్యార్థులు, ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్యూబాలో చదువుతున్న పాలస్తీనా విద్యార్థులు కూడా పాల్గొన్నారు. క్యూబాలో పాలస్తీనా రాయబారి అక్రమ్ సంహాన్ మాట్లాడుతూ, గాజాలో ఇజ్రాయిల్ బాంబుదాడుల్లో మరణించిన, గాయపడిన వారి వివరాలు తెలియజేశారు. తమ ప్రజలకు మద్దతును ప్రకటించినందుకు క్యూబా నేతలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్యూబా విద్యార్థులు, ప్రొఫెసర్లు ప్రసంగించారు. వారిలో కొంతమంది తాము రాసిన కవితలను చదివి వినిపించారు. ఇజ్రాయిల్ ఏకపక్షంగా సాగిస్తున్న అమానుష దాడులు, చర్యలను ముక్తకంఠంతో వారు ఖండించారు. నెతన్యాహు ప్రభుత్వానికి అమెరికా, పశ్చిమ దేశాలు ఇస్తున్న బేషరతు మద్దతును వారు తీవ్రంగా నిరసించారు. పాలస్తీనా ప్రజలకు న్యాయం చేయాలని. సార్వభౌమత్వంతో కూడిన స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు పాలస్తీనీయుల హక్కు అని వారు పునరుద్ఘాటించారు. అల్జీరియా, యెమెన్ రాయబారులు, క్యూబన్ అరబ్ యూనియన్ (యుఎసి), క్యూబన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీపుల్ ఫ్రెండ్‌షిప్ (ఐసిఎపి)లు ఈ సంఘీభావ సభలో పాల్గొన్నాయి.

మధ్యప్రదేశ్‌లో 186 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులు..

• **93 మందికి నేరచరిత్ర**

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యేల ఆదాయ వివరాలను, క్రిమినల్ కేసుల చిట్టాను ఓ సర్వే సంస్థ బయటపెట్టింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని 230 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలలో 93 మంది క్రిమినల్ కేసులను కలిగి ఉన్నారు. ఆ 93 మందిలోనూ 47 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదైనట్లు నివేదించింది. ఓ ఎమ్మెల్యేపై హత్య కేసు (ఐపిసి సెక్షన్ 302) నమోదైంది. ఆరుగురు ఎమ్మెల్యేలపై హత్యాయత్నం (ఐపిసి 307), ఇద్దరు ఎమ్మెల్యేలపై నేరం (ఐపిసి 354) కింద కేసులు నమోదైనట్లు వివరించింది. రాష్ట్రంలోని 230 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలలో 186 మంది కోటీశ్వరులు అని పేర్కొంటూ మరో ఆసక్తికరమైన నివేదికను ఎడిఆర్ ప్రకటించింది. రాష్ట్రంలో 129 మంది బిజెపి ఎమ్మెల్యేలు ఉండగా.. అందులో 83 శాతం అంటే 107 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులే. ఇక 97 మంది కాంగ్రెస్ శాసనసభ్యుల్లో 76 మంది కోటీశ్వరులే. నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉండగా.. వారిలో ముగ్గురు కోటీశ్వరులు. బిజెపికి చెందిన కట్ని జిల్లా విజయరాఘవగర్ ఎమ్మెల్యే సంజయ్ పాఠక్ అత్యంత సంపన్నుడిగా నిలిచారు. ఆయన మొత్తం ఆస్తి విలువ రూ.226 కోట్లకు పైమాటే.

న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడి జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం ఇన్‌ఛార్జి అమిత్ చక్రవర్తిల జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది. తదుపరి కస్టడీని కోరుతూ ఢిల్లీ పోలీసులు వారిని కోర్టు ముందు ప్రవేశపెట్టారు. ఈ మేరకు అదనపు సెషన్స్ జడ్జి హర్దీప్ కౌర్ వారి కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చైనా అనుకూల వార్తలు ప్రసారం చేస్తోందని ఆరోపిస్తూ ఉగ్రవాద వ్యతిరేక చట్టం యుఎపిఎ కింద ఢిల్లీ పోలీసులు ఈనెల 3న ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం విదితమే. వీరి అరెస్టులు దేశవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మోడీ సర్కారు మీడియాపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని పలు మీడియా సంస్థలు, జర్నలిస్టులు, మేధావులు విమర్శిస్తున్నారు.

భారత్‌తో దౌత్యవివాదంలో అమెరికా, యుకె మద్దతు కెనడాకే

న్యూఢిల్లీ: ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఇండియా – కెనడా దేశాల మధ్య తీవ్ర దౌత్య వివాదానికి కారణమైంది. ఈ వివాదంలో కెనడాకు మద్దతుగా అమెరికా, బ్రిటన్ నిలిచాయి. దౌత్య సమానత్వం కోసం కెనడాకు సంబంధించిన 41 మంది దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవాలని ఇండియా కోరింది. ఈ నెల 10 వరకు డెడ్ లైన్ విధించింది. లేకపోతే వారికి దౌత్యవేత్తలకు ఇస్తున్న రక్షణలను తొలగిస్తామని తెలిపింది. ఇరు పక్షాల చర్చల కారణంగా ఇది ఈ నెల 20 గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కెనడా తన 41 మంది దౌత్యవేత్తలను ఇండియా నుంచి తిరిగి రప్పించుకుంది. భారత్ వియన్నా కన్వెన్షన్‌ను ఉల్లంఘిస్తుందని కెనడా విమర్శించింది. దౌత్య సమానత్వాన్ని కోరుకోవడాన్ని నిబంధనల ఉల్లంఘనగా చెప్పుకోవద్దని భారత్ కెనడాకు సూచించింది. ప్రస్తుతం భారత్, కెనడాల్లో ఇరు వైపుల 21 మంది దౌత్యవేత్తలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి కెనడాకు అమెరికా, బ్రిటన్ దేశాలు వత్తాసు పలికాయి. వియన్నా ఒప్పంద సూత్రాలను, దౌత్యసంబంధాలపై భారత్ తన బాధ్యతలను నిర్వర్తించాలని తాము ఆశిస్తున్నట్లు అమెరికా వ్యాఖ్యానించింది. మరోవైపు యుకె కూడా కెనడాకు మద్దతు ప్రకటించింది. "భారత్ నుంచి కెనడా దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించాలనే భారత నిర్ణయాన్ని మేం అంగీకరించలేము. దౌత్యపరమైన రక్షణలను ఏకపక్షంగా ఎత్తివేయడం, వియన్నా ఒప్పందానికి అనుగుణంగా లేదు" అంటూ బ్రిటన్ విదేశాంగ కార్యాలయ అధికార ప్రతినిధి వెల్లడించారు

శిశువుపై అత్యాచారం కేసులో మళ్లీ విచారణ : సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : మూడు మాసాల శిశువుపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన కేసులో వ్యక్తిని దోషిగా నిర్ధారించడాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో తాజాగా విచారణ జరపాలని ఆదేశించింది. నిందితుడికి తన వాదన వినిపించే అవకాశం ఇవ్వకుండా హడావిడిగా కేసు విచారణను ముగించేసినట్లు వుందని వ్యాఖ్యానించింది. 2018లో నమోదైన ఈ కేసులో చార్జిషీట్ దాఖలైన తేదీ నుండి కేవలం 15రోజుల వ్యవధిలో విచారణ సాగిందని కోర్టు పేర్కొంది. ట్రయల్ కోర్టు నిందితుడిని అనేక నేరాల్లో దోషిగా నిర్ధారించి, మరణ శిక్ష విధించిందని తెలిపింది. నిందితుడికి తనను తాను సమర్ధించుకునేందుకు సరైన అవకాశం ఇవ్వకుండా చాలా హడావిడిగా విచారణ ముగించేసినట్లు కనిపిస్తోందని, అటువంటప్పుడు ఆ విచారణ అర్ధరహితంగా వుంటుందని జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. అందువల్ల ఈ కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతున్నామని, తిరిగి విచారణ జరపాల్సిందిగా ట్రయల్ కోర్టును ఆదేశిస్తున్నామని బెంచ్ తెలిపింది. పిటిషనర్ నవీన్ పెట్టుకున్న పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు పై తీర్పు వెలువరించింది.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISHAKHAPATNAM
Ground & 1st Floor, Sri Narayana BHavan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam- 530020

O.A.1011/2023

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

IDBI Bank Limited, Vijayawada Branch
VS
Smt Mallipeddi Lalitha and Another

To,
D1 - Smt Mallipeddi Lalitha, W/o.M.Sambasiva Rao,
resident of D.No.8-75, Flat No.F-103, Jaya Durga Towers, Kamayyathopu Center, Penumaluru Mandal, Kanuru, Vijayawada-520007.
D2 - Mallipeddi Sambasiva Rao, S/o.Venkateswara Rao,
resident of D.No.8-75, Flat No.F-103, Jaya Durga Towers, Kamayyathopu Center, Penumaluru Mandal, Kanuru, Vijayawada-520007.

PAPER PUBLICATION

WHEREAS, O.A.1011/2023 was listed before Hon'ble Presiding Officer/Registrar on **07/11/2023.**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.21,46,096/-** (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **07/11/2023**.at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this 19th day of October 2023

Signature of the Officer
Authorized to issue summons

పాలస్తీనియన్లకు సంఘీభావంగా కైరో, లండన్‌లలో భారీ ర్యాలీలు

(మొదటి పేజీ తరువాయి)

మందితో ప్రదర్శన జరిగితే ఈవారం అంతకంటే ఎక్కువమంది హాజరయ్యారని పాలస్తీనా సంఘీభావ క్యాంపెయిన్ డైరెక్టర్ బెన్ జమాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. హింసకు మూల కారణాన్ని పరిష్కరించనిదే ఈ ఉద్రిక్తతలు చల్లారవని ఆయన అభిప్రాయపడ్డారు.

కైరోలో సమిష్టి ప్రార్థనల అనంతరం 'ఈజిప్ట్ ఫ్రైడే' పేరుతో నిర్వహించిన ర్యాలీలో పాలస్తీనా పతాకాలు, 'సేవ్ గాజా' పోస్టర్లు పెద్దయెత్తున ప్రదర్శించారు. కైరోలోని నాసర్ సిటీ ప్రధాన వీధుల గుండా ఈ ప్రదర్శన జరిగింది.

గాజాపై హంతక యుద్ధ నేరాలు ఆపాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాల ప్రకారం స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటు చేయాలని కోరుతూ లండన్ డౌన్‌స్ట్రీట్‌లో గత కొన్ని రోజులుగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. అవన్నీ ఒక ఎత్తు అయితే శనివారం వివిధ ప్రగతిశీల, శాంతి కాముక సంస్థలు, ప్రజాతంత్రవాదులు ఇచ్చిన పిలుపు మేరకు లక్షలాది మందితో జరిగిన ప్రదర్శన మరో ఎత్తు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, జర్మనీ అధ్యక్షుడు ఒలాఫ్ షుల్జ్ ఇజ్రాయిల్‌కు వెళ్లి యుద్ధోన్మాది నెతన్యాహు ఈ యుద్ధంలో గెలవాలని, అందుకు అవసరమైన ఆయుధాలు, నిధులు సమకూర్చుతామని హామీ ఇవ్వడాన్ని ప్రదర్శకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దశాబ్దాలుగా సైనిక అణచివేత, వర్ణ వివక్ష, పాలస్తీనీయులపై అణచివేతకు పాల్పడుతున్న రాజ్యానికి ఈ దేశాల అధినేతలు మద్దతు ఇవ్వడం సిగ్గు సిగ్గు అని వారు ఎద్దేవా చేశారు. సునాక్, బైడెన్ వ్యాఖ్యలు ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు ఆమోదం తెలిపేవిగా వున్నాయని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు విమర్శించాయి.

పాలస్తీనీయులకు అండగా నిలిచిన గ్రెటా థన్‌బర్గ్

ఇజ్రాయిల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న పాలస్తీనా, గాజా వాసులకు వాతావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్ అండగా నిలిచారు. తనతోపాటు మరో నలుగురు కార్యకర్తలు పాలస్తీనా, గాజాకు సంఘీభావం తెలుపుతూ ప్లకార్డు పట్టుకుని ఉన్న ఫొటోలను గ్రెటా తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గ్రెటా పాలస్తీనాకు సంఘీభావం తెలపడంపై ఇజ్రాయెల్ ఆక్రోశం వెళ్లగక్కింది. హమాస్ దాడిలో హత్యకు గురైన ముగ్గురు 19 ఏళ్ల ఇజ్రాయిలీయుల ఫొటోలను పోస్ట్ చేసి దీనికి మీ సమాధానం ఏమిటి? అని ఎదురుదాడి చేసింది. దీనికి గ్రెటా దీటుగానే బదులిచ్చారు 'స్టాండ్ విత్ గాజా' అనే ప్లకార్డును తాను పట్టుకుని ఉన్న ఫొటోను ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఈరోజు మేము పాలస్తీనా, గాజాకు సంఘీభావంగా సమ్మె చేస్తున్నాం. తక్షణమే కాల్పులు విరమించండి. పాలస్తీనియన్లకు, బాధిత పౌరులకు స్వేచ్ఛ, న్యాయం కోసం ప్రపంచం మాట్లాడాలి' అని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో గ్రెటా థన్‌బర్గ్ పోస్ట్ వైరల్‌గా మారింది. నెటిజన్లు గ్రెటాకు మద్దతునిస్తున్నారు.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా
Celebrating 100 Years of Trust 1924

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, 1వ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.
ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, రుణదాతకు మార్టిగేజి చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే ''ఎక్కడ ఉన్నది అక్కడే'' ''ఉన్నది ఉన్నట్లే'' మరియు ''యదాతథం'' ప్రాతిపదికపై 16-11-2023 తేదీన విక్రయించబడునని దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలు / హామీదారులు / సహపూచీదారుల నుండి బకాయిపడిన మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించబడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు)లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి (ఫోన్: 99852 02444)

వ.నెం.1: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: (1) M/s. శ్యామ్ కాటన్ ట్రేడింగ్ కార్పొరేషన్, డి.నెం.6-35, బిసి కాలనీ, కాకుమాను, గుంటూరు-522112, (2) శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి, తండ్రి: శ్రీ పెదపూడి అక్కయ్య, యజమాని: మెస్సర్స్ శ్యామ్ కాటన్ ట్రేడింగ్ కార్పొరేషన్, (3) శ్రీమతి నవజ్యోతి పెదపూడి, భర్త: శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి. నెం.2) & 3) యొక్క చిరునామా: డి.నెం. 6-149, కాకుమాను, గుంటూరు-522112 మరియు (4) శ్రీ శ్యామ్ రాజు నీలం, తండ్రి: శ్రీ బెంజమిన్, చిరునామా: నెం.26-20-25, టీచర్స్ ఎన్‌క్లేవ్, ఎ బ్లాక్, శాంతినగర్, 4వ లైను, నగరంపాలెం, గుంటూరు-522004. నిర్మాణాత్మక స్వాధీనత తేది: 04.01.2023.
బకాయి మొత్తం: i) PSOD/A/c No. 2557000600474601 క్రింద రూ.1,27,77,946.20/- (అక్షరాల ఒక కోటి ఇరవై ఏడు లక్షల డెబ్బై ఏడు వేల తొమ్మిది వందల నలభై ఆరు రూపాయలు మరియు ఇరవై పైసలు మాత్రమే) + 01.10.2023 నుండి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు మొ॥ ii) PSTL/A/c No.2557001801150801 క్రింద రూ.21,56,667.76/- (అక్షరాల ఇరవై ఒక్క లక్షల యాభై ఆరు వేల ఆరు వందల అరవై ఏడు రూపాయలు మరియు డెబ్బై ఆరు పైసలు మాత్రమే) + 01.10.2023 నుండి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వెరశి మొత్తం: రూ.1,49,34,613.96/- (అక్షరాల ఒక కోటి నలభై తొమ్మిది లక్షల ముప్పై నాలుగు వేల ఆరు వందల పదమూడు రూపాయలు మరియు తొంభై ఆరు పైసలు మాత్రమే).
ఆస్తి యొక్క వివరము: 1) గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, జడ్‌పి స్కూల్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్ దగ్గర, నంబూరు గ్రామము, సమీప డోర్ నెం.18-221, డి.నెం. 427/B1, 427/B-1B నందు శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి పేరునగల 629.20 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: లేటు భీమవరపు సీతారత్తమ్మ యొక్క స్థలము; దక్షిణం: తియ్యగూర అంజిరెడ్డి యొక్క స్థలము; పడమర: షేక్ మీరాసా షేక్ బాజీ యొక్క స్థలము మొ॥; ఉత్తరం: డి.నెం.428 లోని సర్కారు డొంక.

రిజర్వుధర: రూ.65,65,000/- (అక్షరాల అరవై ఐదు లక్షల అరవై ఐదు వేల రూపాయలు మాత్రమే) (1% టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.6,56,500/- (అక్షరాల ఆరు లక్షల యాభై ఆరు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే)

2) గుంటూరు జిల్లా, శాంతినగర్ ఎక్స్‌టెన్షన్, 4వ లైను, నగరంపాలెం, అగ్రహారం, డోర్ నెం. 26-20-65 నందు టీచర్స్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, మొదటి అంతస్తులో శ్రీ శ్యామ్ రాజు నీలం పేరునగల రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.FF1 మరియు మొత్తం 400 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 32 చ॥గ॥లతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా; దక్షిణం: శూన్యాకాశము; పడమర: శూన్యాకాశము; ఉత్తరం: ఫ్లాట్ నెం. FF3. మొత్తం ఆస్తికి హద్దులు: తూర్పు: ఐ.సత్యనారాయణ యొక్క ఆస్తి; దక్షిణం: జె.నిల్సన్ & డాన్ భూషణం యొక్క ఆస్తి; పడమర: 30' వెడల్పుగల మునిసిపల్ రోడ్డు; ఉత్తరం: సుబ్బారావు యొక్క ఆస్తి.

రిజర్వుధర: రూ.22,00,000/- (అక్షరాల ఇరవై రెండు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా: రూ.2,20,000/- (అక్షరాల రెండు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే)

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి (ఫోన్: 99852 02444)

వ.నెం.2: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: (1) మెస్సర్స్ కనకదుర్గ కాటన్ ట్రేడర్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న యజమాని: శ్రీమతి కనకదుర్గ తెల్లాకుల, C/o. శ్రీ సాంబశివరావు తెల్లాకుల, షాపు నెం. జిఎఫ్ 5, ఫ్యాన్సీ డిస్ట్రిబ్యూటర్ ప్లాజా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురు, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522003. (2) శ్రీమతి కనకదుర్గ తెల్లాకుల, భర్త: శ్రీ వి.సాంబశివరావు తెల్లాకుల, (3) శ్రీ వి సాంబశివరావు తెల్లాకుల, తండ్రి: శ్రీ రామగురునాథం తెల్లాకుల, నెం.2&3 చిరునామా: ఫ్లాట్ నెం.402, 4వ అంతస్తు, ఎఆర్ ప్రైడ్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ దగ్గర, శ్యామలానగర్, గుంటూరు-522006. (4) శ్రీమతి తూనుగుంట్ల విజయలక్ష్మి, భర్త: శ్రీ కాశీవిశ్వేశ్వరరావు తూనుగుంట్ల, (5) శ్రీ కాశీ విశ్వేశ్వరరావు తూనుగుంట్ల, తండ్రి: శ్రీ వెంకట కోటేశ్వరరావు, నెం.4&5 చిరునామా: C/o. శ్రీ సాంబశివరావు తెల్లాకుల, షాపు నెం. జిఎఫ్ 5, ఫ్యాన్సీ డిస్ట్రిబ్యూటర్ ప్లాజా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురు, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522003. సింబాలిక్ స్వాధీనత తేది: 04.01.2018.
బకాయి మొత్తం: A/c.No.2557000600473201 క్రింద రూ.1,33,96,996.34 (అక్షరాల ఒక కోటి ముప్పైమూడు లక్షల తొంభై ఆరు వేల తొమ్మిది వందల తొంభై ఆరు రూపాయలు మరియు ముప్పై నాలుగు పైసలు మాత్రమే) + 01-07-2020 తేదీనుండి నుండి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా.
ఆస్తి యొక్క వివరము: గుంటూరు సిటీ, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ న్యూ లిమిట్స్, డి.నెం.912/డి1 నందు శ్రీ వి.సాంబశివరావు తెల్లాకుల కు చెందిన 200 చ॥గ॥ విస్తీర్ణముగల ఫ్లాట్ నెం.32 నకు సంబంధించిన యావత్తు. సరిహద్దులు: తూర్పు: 30 అ॥ వెడల్పుగల రోడ్డు; పడమర: 12 అ॥ వెడల్పుగల రోడ్డు; ఉత్తరం: కె.జనార్ధన్ యస్‌విరావు యొక్క ఫ్లాట్ నెం.31. దక్షిణం: ఫ్లాట్ నెం.33. లొకేషన్: అక్షాంశము: 16.269145 N మరియు రేఖాంశము: 80.4696856 E.

రిజర్వుధర: రూ.9,00,000/- (అక్షరాల తొమ్మిది లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.90,000/- (అక్షరాల తొంభై వేల రూపాయలు)

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ - భవానీపురం బ్రాంచి (ఫోన్: 0866-2411488(G) / 9581116617 (BM))

వ.నెం.3: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: (1) మెస్సర్స్ జెఆర్‌ఆర్ ట్రేడర్స్ తరపున పార్టనర్స్: ఎ) శ్రీ యార్లగడ్డ జయరామారావు మరియు బి) శ్రీమతి యార్లగడ్డ నిరీక్షణ, చిరునామా: ఫ్లాట్ నెం.9-53/3, యాదవుల బజారు, ప్రసాదంపాడు, విజయవాడ-521108. (2) శ్రీ యార్లగడ్డ జయరామారావు, తండ్రి: శ్రీ వెంకట ప్రసాద్ మరియు (3) శ్రీమతి యార్లగడ్డ నిరీక్షణ, భర్త: శ్రీ యార్లగడ్డ జయరామారావు, నెం.(2) మరియు (3) చిరునామా: నెం.3-222, అన్నెవారి స్ట్రీట్, కానూరు, విజయవాడ-520007. నిర్మాణాత్మక స్వాధీనత తేది: 24.04.2023. బకాయి మొత్తం: PSOD A/c No.8137000600002501 క్రింద రూ.2,33,07,891.29 పై॥ (అక్షరాల రెండు కోట్ల ముప్పైమూడు లక్షల ఏడు వేల ఎనిమిది వందల తొంభై ఒకటి రూపాయలు మరియు ఇరవై తొమ్మిది పైసలు మాత్రమే) + 01.10.2023 నుండి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా
ఆస్తి యొక్క వివరము: ఐటమ్ నెం.1: గుంటూరు, మేడికొండూరు మండలం, పేరేచర్ల గ్రామము & గ్రామపంచాయతీ, వర్మికంపోస్ట్ షెడ్స్ దగ్గర, అసెస్‌మెంట్ నెం.22-71, డి.నెం.8-831, డి.నెం.389/F, 390/A & రివైజ్డ్ ఆర్‌యస్ నెం.389/E నందు శ్రీ జయ రామారావు యార్లగడ్డకి చెందిన 0.55 సెంట్లు లేదా 2662 చ॥గ॥ల విస్తీర్ణములోని పౌల్ట్రీ షెడ్స్ ఇండస్ట్రియల్ ఆస్తికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: డొంక; దక్షిణం: గాలి బోసు యొక్క ఆస్తి; పడమర: పొలిమేర డొంక మరియు ఉత్తరం: తమ్మా లక్ష్మణ రెడ్డి యొక్క ఆస్తి. అక్షాంశము మరియు రేఖాంశము: 16.317114N మరియు 80.331929 E.

రిజర్వుధర: రూ.1,41,40,000/- (అక్షరాల ఒక కోటి నలభై ఒక్క లక్షల నలభై వేల రూపాయలు) (1% టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.14,14,000/- (అక్షరాల పద్నాలుగు లక్షల పద్నాలుగు వేల రూపాయలు)

ఐటమ్ నెం.2: గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, అగ్రహారం, 1వ లైను, ప్రస్తుత వార్డు నెం.26, ఇందిరాగాంధీ స్టాట్యూ లైన్, డోర్ నెం.26-19-36, టి.యస్.నెం.5, బ్లాక్ నెం.1, వార్డు నెం.21 (కొత్తది) & 17 (పాతది) నందు శ్రీమతి నిరీక్షణ యార్లగడ్డకి చెందిన 92 చ॥గ॥ల విస్తీర్ణముగల స్థలము మరియు అందులోని రెసిడెన్షియల్ ఇంటి ఆస్తికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: వాగు; దక్షిణం: దేవరశెట్టి కృష్ణమూర్తి యొక్క ఆస్తి; పడమర: మునిసిపాలిటీ రోడ్డు మరియు ఉత్తరం: షేక్ హమ్మీద్ యొక్క ఆస్తి. అక్షాంశము మరియు రేఖాంశము: 16.3007851'N, మరియు 80.4258728'E.

రిజర్వుధర: రూ.34,00,000/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.3,40,000/- (అక్షరాల మూడు లక్షల నలభై వేల రూపాయలు)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు / సహపూచీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ అనగా www.karnatakabank.com లో "mortgaged assets for sale" హెడ్ క్రింద సందర్శించండి.
ఇ-వేలము 16.11.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును. ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును https://bankauctions.in/ నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను (తాత్కాలికంగా 15.11.2023న) ఆన్‌లైన్ ద్వారా M/s.4closure, 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ- 500038, సంప్రదించవలసిన నెం: 040-23736405, Mobile: 8142000062/63/64/66, Email: prakash@bankauctions.in and info@bankauctions.in నుండి పొందవచ్చును.

తేది: 19.10.2023, ప్రదేశం: హైదరాబాద్
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

ఆడి పాడేద్దాం

బడికి సెలవులిచ్చేశారు
అందరు ఊరెల్లి పోదాం
అమ్మమ్మ తాతయ్య
ఒడిలో వాలిపోదాం

చెట్టుపుట్టలు తిరిగేద్దాం
తొక్కుడు బిళ్ల ఆడేద్దాం
ఉప్పు బస్తా మోసేద్దాం
పిల్ల కాలువలో ఈదేద్దాం

చేళ్లగట్ల మీద చెలరేగుదాం
తూనీగ వెంట పడదాం
అత్తిపత్తి ఆకులు ముట్టేద్దాం
నీటి బుడగలు ఊదేద్దాం

సెల్లుకి టాటా చెప్పేద్దాం
టీవీకి దూరంగా ఉండేద్దాం
కుంటాటలో గెంతుదాం
పజిల్‌తో మెదడకు పదును పెట్టేద్దాం

పిల్లల కథలు చదివేద్దాం
పిల్లల పాటలు పాడేద్దాం
నచ్చిన డాన్సులు చేసేద్దాం
మనలోవున్న సృజన బయటకు తీసేద్దాం

వెన్నెల రాత్రుల్లో కమ్మని కబుర్లు చెప్పేద్దాం
అవ్వాతాత చెప్పే కథలింటూ బజ్జుందాం
సెలవులన్నీ ఇట్టే గడిశాయని అలుగుదాం
తీపిజ్ఞాపకాలన్నీ మన వెంట మోసుకుపోదాం

- గాదిరాజు రంగరాజు



లెక్క చేయండి

పిల్లలూ, ఇచ్చిన క్లూ ఆధారంగా పక్కనే ఉన్న గుర్తులను అంకెలుగా గణించి లెక్కచేయండి.

నేను గీసిన బొమ్మ

గాజుల రుద్రాక్షి,
3వ తరగతి,
ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఎటుచూసినా వెల్లివిరిసే ఉత్సాహం... కనుల పండుగగా వీధి వీధులా వెలుగులీనుతున్న కమనీయ కాంతులు... వీనులవిందుగా నలుదిశలా మార్మోగే పాటలు జోరు... ఆడుతూ పాడుతూ మైమరచి చిందులేసే యువత కేరింతలు... ముసిముసి నవ్వులతో ఆనంద పరవశంతో పులకరింతలు.. పండుగ వాతావరణాన్ని తదేక దృష్టితో చూస్తూ పిల్లలను ఆశీర్వదించే పెద్దలు... పట్టణ వీధుల్లో ఇసుకేస్తే రాలనంత జనబాహుళ్యం... జాతీయస్థాయి క్రీడాకారుల పోటీలతో యువతలో సరికొత్త ఉత్సాహం.. అబ్బుర పర్చే అద్భుతమైన బుట్టబొమ్మల నృత్య ప్రదర్శనలు.. భళిరా భళి అంటూ కళ్లు మిరుమిట్లు గొలిపే భేతాళ నృత్య ప్రదర్శనల కోలాహలం. అడుగడుగునా సంప్రదాయ కోలాటాల ఆనంత హేళలు... భక్తి బృందపు బహుచక్కని భజన కీర్తనలు... బడలిక తెలియకుండా నయన మనోహర నృత్యం చేస్తున్న కళాకారులు... విచిత్రమైన బహు విశేష వేషధారణలు... అబ్బురపర్చే సాంస్కృతిక ప్రదర్శనలు ఝుంఝుం నాదాలు... యుద్ధ విద్యల విన్యాసాలు... పేలుతున్న టపాసుల మోతలు... జుయ్ అంటూ కాంతులతో నిండిన ఆకాశం... ఊరేగింపులు... వీటిన్నిటి కలబోత నూజివీడు దసరా ఉత్సవాల సందడి. సర్వమత సమ్మేళనంగా నూజివీడు దసరా ఉత్సవాలు 115 ఏళ్ల నుంచి సాగుతున్నాయి. ముస్లింలు కూడా ఈ ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొనడం సర్వమత సమ్మేళనానికి నిదర్శనం.

సర్వమత సమ్మేళనానికి ప్రతిరూపం

ప్రపంచంలో కర్నాటక రాష్ట్రంలోని మైసూరులో దసరా ఉత్సవాలు ఎంతో పేర్గాంచాయి. ఆంధ్రా మైసూరుగా నూజివీడు పేరుగాంచింది. దాదాపుగా 115 సంవత్సరాలపాటు క్రమం తప్పకుండా నిర్విరామంగా ఈ మహోత్సవాలను ఇక్కడి నిర్వహిస్తూ వస్తున్నారు. 1952 నుంచి 2023 వరకూ కొనసాగుతూ 71వ వార్షికోత్సవాన్ని ఏడాది నిర్వహిస్తున్నారు. మైసూరులో వడయార్ రాజా వంశీయులు మాదిరిగానే ఉయ్యూరు రాజా వారు జమ్మి కొట్టి అమ్మవారికి పూజ చేయడం, ఉయ్యూరు జమీందారు గౌరవ సూచకంగా తుపాకీ పేల్చి, జమ్మి చెట్టుకు పూజ చేయడంతో దసరా ఉత్సవాలను సంప్రదాయ బద్ధంగా ప్రారంభిస్తారు. కుల, మత, ప్రాంతం వంటి బేధాలు లేకుండా ప్రజానీకం ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు.

బుట్టబొమ్మల ఊరేగింపు ప్రత్యేకత

ప్రాచీన సాంప్రదాయంలో భాగంగా బుట్ట బొమ్మల ఊరేగింపు దసరా వేడుకలకు హైలెట్‌గా నిలవనుంది. ఐరావత వాహనం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. బుట్ట బొమ్మలు ఉయ్యూరు ఎస్టేట్ నుండి ప్రారంభమై దసరా రోజున పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ఊరేగింపుగా ప్రదర్శన కొనసాగుతుంది. రాత్రి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు మరుసటి రోజు తెల్లవారే వరకు సాగే బుట్ట బొమ్మల ప్రదర్శనలో యాత్రికులు, సందర్శకులు వేలాదిగా పాల్గొంటారు.

ఈ ఏడాది హంస వాహనం ఏర్పాటు

దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయవాడలో కనకదుర్గమ్మకు కృష్ణానదిలో తెప్పోత్సవం (జలవిహారం) నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అదేవిధంగా నూజివీడులో ఈ ఏడాది హంస వాహనం ప్రత్యేకంగా ఏర్పాటుచేసి ఊరేగించనున్నారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీమత్ కామాక్షి అమ్మవారి ఆలయంలో సంప్రదాయ బద్ధంగా శ్రీదేవి దసరా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తారు. దసరా రోజున రాత్రి 9 గంటలకు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనను ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

- యడవల్లి శ్రీనివాసరావు

చారిత్రక వైభవానికి సాక్ష్యం నూజివీడు సంబరాలు

గతంలో ఏడు సంస్థానాలకు రాజధానిగా భాసిల్లిన నూజివీడు రాచరికపు కోటలకు నిలయంగా ఉండేది. తమ కోటలను శత్రువుల బారి నుంచి పరిరక్షించుకునేందుకు గుర్రాలు, కుక్కల గేట్లను సైతం నిర్మించారు. నేటికీ ఆ గేట్లు అలాగే ఉన్నాయి. కీర్తిశేషులు డాక్టర్ ఎం.ఆర్.అప్పారావు తండ్రి రాజా మేకా వెంకటాద్రి అప్పారావు (ఉయ్యూరు ఎస్టేట్) నాయకత్వంలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించటం ప్రారంభించారు. ఐదు దశాబ్దాలకుపైగా ఆయన నేతృత్వంలో ఈ ఉత్సవాలు జరిగాయి. ఏనుగు అంబారీలు (ఐరావతం)పై పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, కోట శివాలయం, రాజగోపాలస్వామి ఆలయాలకు చెందిన ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి పట్టణమంతా సంచారం చేసేవారు. ఏనుగులతోపాటు ఒంటెలు, గుర్రాలు ప్రదర్శనలో ఉండేవి. ఆ వెనుక తప్పెట్లు, బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, కోలాటాలు, భజనలు, విచిత్ర వేషధారులు ఉండడం ఆనవాయతీ. ఇప్పుడు కూడా అనేక రకాల కళాకారులు ఉత్సవాల్లో పాల్గొని తమ కళారూపాలను ప్రదర్శిస్తుంటారు. దసరా పండుగ పర్వదినాన నగరమంతా భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ వేడుకలను తిలకించేందుకు ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నలుమూలల నుంచి ప్రజానీకం వస్తారు. ఉయ్యూరు ఎస్టేట్ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల నిర్వహణ బాధ్యతను రాజా వెంకటాద్రి అప్పారావు నూజివీడు స్పోర్టింగ్ క్లబ్‌కు 1952లో అప్పగించారు. బొబ్బిలి బాల నేతృత్వంలో పరిమిశెట్టి రామకృష్ణ (చంటి), యిరవా చలపతిరావు అధ్యక్ష కార్యదర్శులుగా స్పోర్టింగ్ క్లబ్ ఏర్పడి దసరా ఉత్సవాలను నిర్వహణా బాధ్యతలు చేపట్టింది. వారి అనంతరం కీర్తిశేషులు పి.బాలకృష్ణ, బొబ్బిలి కొండలరావు అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం రామిశెట్టి మురళీకృష్ణకుమార్ తదితరుల నాయకత్వంలో నేటివరకూ దిగ్విజయంగా కొనసాగిస్తూనే ఉన్నారు.

- పగడాల సత్యనారాయణ
దసరా ఉత్సవాల నిర్వహణా కమిటీ కార్యదర్శి

ఆటల పోటీలతో సందడి

కీర్తిశేషులు రాజా మేకా వెంకటాద్రి అప్పారావు, పరిమిశెట్టి బాలకృష్ణ, బొబ్బిలి కొండలరావుల నేతృత్వంలో దాదాపు 115 ఏళ్ల నుంచి ఈ దసరా సంబరాలు జరుగుతున్నాయి. అంతే వైభవంతో ఈ చారిత్రాత్మక సంబరాలను కొనసాగించాలనే తపనతో స్పోర్టింగ్ క్లబ్ కృషి చేస్తోంది. దాతల ఆదరణ, ప్రజల ప్రోత్సాహంతో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ద్వారా అఖిల భారత చెడుగుడు పోటీలు, దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది 71 వార్షిక అఖిల భారత చెడుగుడు పోటీలు పురుషులు, మహిళల ఆహ్వాన కబడ్డీ పోటీలు, దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈనెల 22న ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 23న చెడుగుడు, కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయి. అదేరోజు రాత్రి దసరా ఉత్సవాల ర్యాలీ ప్రారంభమవుతుంది. 25న విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుంది.

- రామిశెట్టి మురళీకృష్ణకుమార్
నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు

బిజీబిజీగా కార్బిన్ భారత్ పర్యటన

- లెఫ్ట్, ప్రజా సంఘాల నేతలతో ముంబయిలో ఆత్మీయ సమావేశం
- పాలస్తీనాకు పూర్తి సంఘీభావం

ముంబయి ఆత్మీయ సమావేశంలో జెరిమి కార్బిన్, లారా అల్వారెజ్, డాక్టర్ అశోక్ ధావలే తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బ్రిటన్ పార్లమెంటు సభ్యులు, లేబర్ పార్టీ సీనియర్ నేత జెరిమి కార్బిన్ భారత్ పర్యటన బిజీబిజీగా సాగిపోయింది. ఆయన గౌరవార్థం శనివారం ముంబయిలో ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్), ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ (పిఐ) సంయుక్తంగా ఒక ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించాయి. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ సాగిస్తున్న క్రూరమైన దాడులు, అణచివేత వంటి చర్యలను సమావేశం తీవ్రంగా ఖండించింది. శాంతి, న్యాయం కోసం జెరెమీ పోషించిన పాత్రను ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ (పిఐ)కి చెందిన వర్ష జి ఎస్ తన తొలి పలుకుల్లో ప్రస్తుతించారు. బ్రిటన్‌లో కన్సర్వేటివ్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గాన్ని సంఘటితపరచడం లోను, భారతదేశంలో ఏడాదిపాటు సాగిన చారిత్రాత్మక రైతు ఉద్యమానికి మద్దతుగా బ్రిటన్ పార్లమెంట్‌లో దీనిపై చర్చ జరిగేలా చూడడంలో కార్బిన్ ముఖ్యమైన పాత్ర పోషించారని వర్ష జిఎస్ పేర్కొన్నారు. కార్బిన్ మాట్లాడుతూ, పాలస్తీనా ప్రజలపై ఏడున్నర దశాబ్దాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇజ్రాయిల్ యుద్ధంలోనే కాదు, ప్రపంచంలో చాలా యుద్ధాల వెనక అమెరికా పాత్ర ఉందని అన్నారు.. పాలస్తీనాకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా బ్రిటన్‌లోను, ప్రపంచ వ్యాపితంగా వ్యక్తమవుతున్న సంఘీభావం గురించి, ర్యాలీల గురించి లేబర్ పార్టీ నాయకుడు వివరించారు. అమరజీవి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసుతో తన జ్ఞాపకాలను కార్బిన్ గుర్తు చేసుకున్నారు. శాంతి, న్యాయ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు, జెరిమి కార్బిన్ సతీమణి లారా అల్వారెజ్ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు, టెలికమ్యూనికేషన్ దిగ్బంధనాలకు పాల్పడడం శోచనీయమని అన్నారు. ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే, జెరిమి కార్బిన్, లారా అల్వారెజ్‌లను తొలుత పరిచయం చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేకత, సామ్యవాదం పట్ల నిబద్ధత కలిగిన నేత కార్బిన్ 40 సంవత్సరాలుగా బ్రిటిష్ పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2015 నుండి 2019 వరకు లేబర్ పార్టీ నాయకుడిగా, పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా కార్బిన్ చేసిన కృషిని వివరించారు. వచ్చే ఏడాది భారత్, బ్రిటన్‌లలో సాధారణ ఎన్నికలు జరగనున్నందున, ఆ ఎన్నికల్లో వామపక్ష ప్రగతిశీల శక్తుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా అందరూ నిలవాలని ఆయన కోరారు.

వామపక్షాల తరపున సిపిఐ ప్రకాష్ రెడ్డి జెరెమీ కార్బిన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించగా, ప్రముఖ సినీ నిర్మాత ఆనంద్ పట్వర్ధన్ లారా అల్వారెజ్‌ను, సంజీవ్ చందోర్కర్ వర్ష జిఎస్ ను అభినందించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉదయ్ నార్కర్‌ను జెరెమీకి నెహ్రూ జాకెట్‌ను బహుకరించగా, ఆయన. దానిని అక్కడే ధరించి చూశారు. ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే లారా అల్వారెజ్‌కు శాలువా కప్పి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వివేక్ మోంటెరోలు జెరెమీ, లారాలకు జ్ఞాపికలను అందజేశారు. చివరగా డాక్టర్ అశోక్ ధావలే భారతదేశం, మహారాష్ట్రలో రైతుల పోరాటాలపై మూడు పుస్తకాలను కార్బిన్‌కు అందించారు. చివరిలో సభికుల ప్రశ్నలకు జెరెమీ క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. మహారాష్ట్రలోని దాదాపు 35 మంది వామపక్ష నేతలు, ప్రగతిశీల మేధావులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

కుమ్మేసిన క్లాసెన్

- హెన్రిక్స్, డుస్సెన్, జెన్సన్ అర్ధసెంచరీలు
- ఇంగ్లండ్‌పై 229పరుగుల భారీ తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు

ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో భాగంగా వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఆకాశమే హద్దుగా చెలరేగగా.. హెన్రిక్స్, డుస్సెన్, జెన్సన్ అర్ధసెంచరీలతో మెరిసారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్లకు 399 పరుగుల భారీస్కోరు నమోదు చేశారు. ఛేదనలో ఇంగ్లండ్ 22 ఓవర్లలో 170పరుగులకే ఆలౌటైంది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 229పరుగుల తేడాతో నెగ్గి ఈ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగుల తేడాతో నెగ్గిన జట్టుగా రికార్డు నెలకొల్పింది. అలాగే ఇంగ్లండ్ జట్టు ఇన్ని పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమిపాలవ్వడం ఇదే ప్రథమం. తొలుత ఓపెనర్ క్వింటన్ డికాక్(4) వికెట్‌ను త్వరగా కోల్పోయి దక్షిణాఫ్రికా.. 2వ వికెట్‌కు హెన్రిక్, డుస్సెన్ కలిసి 121పరుగులు జతచేశారు. సఫారీ ఓపెనర్ రీజా హెండ్రిక్స్‌తో మొదలుపెడితే, చివర్లో జాన్సన్ వరకు ఉతికారేశారు. వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ వీర మాస్ సెంచరీ ఇన్నింగ్స్‌కే హైలైట్‌గా నిలిచింది. క్లాసెన్ 67బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 109 పరుగులు చేశాడు. టోప్లేకు మూడు, మార్క్‌వుడ్, రషీద్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు తొలినుంచే చేతులెత్తేసింది. టాప్, మిడిలార్డర్ బ్యాటర్స్ అందరూ చేతులెత్తేయగా.. చివర్లో అట్కిన్సన్(35), మార్క్ వుడ్(43) బ్యాట్ ఝుళిపించారు. కోర్ట్జేకు మూడు, ఎన్గిడి, జెన్సన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ క్లాసెన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి)బట్లర్ (బి)టోప్లే 4, హెన్రిక్స్ (బి)ఆదిల్ రషీద్ 85, డుస్సెన్ (సి)బెయిర్‌స్టో (బి)రషీద్ 60, మార్క్రమ్ (సి)బెయిర్‌స్టోర్ (బి)టోప్లే 42, క్లాసెన్ (బి)అట్కిన్సన్ 109, డేవిడ్ మిల్లర్ (సి)స్టోక్స్ (బి)టోప్లే 5, జెన్సన్ (నాటౌట్) 75, కోర్ట్జే (సి)లివింగ్‌స్టోన్ (బి)అట్కిన్సన్ 3, మహరాజ్ (నాటౌట్) 1, అదనం 15. (50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 399పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/125, 3/164, 4/233, 5/243, 6/294, 7/398 **బౌలింగ్:** టోప్లే 8.5-0-88-3, డేవిడ్ విల్లీ 9-1-61-0, రూట్ 6.1-0-48-0, అట్కిన్సన్ 9-0-60-2, మార్క్ వుడ్ 7-0-76-0, ఆదిల్ రషీద్ 10-0-61-2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (సి)డుస్సెన్ (బి)ఎన్గిడి 10, మలన్ (సి)డికాక్ (బి)జెన్సన్ 6, రూట్ (సి)మిల్లర్ (బి)జెన్సన్ 2, స్టోక్స్ (సి అండ్ బి) రబడా 5, బ్రూక్ (ఎల్‌బి)కోర్ట్జే 17, బట్లర్ (సి)డికాక్ (బి)కోర్ట్జె 15, డేవిడ్ విల్లీ (సి)రబడా (బి)ఎన్గిడి 12, ఆదిల్ రషీద్ (సి)హెన్రిక్స్ (బి)కోర్ట్జె 10, అటిన్సన్ (బి)మహరాజ్ 35, మార్క్‌వుడ్ (నాటౌట్) 43, టోప్లే (ఆబ్సెంట్) 0, అదనం 15. (22ఓవర్లలో) 170పరుగులకు ఆలౌట్. **వికెట్ల పతనం:** 1/18, 2/23, 3/24, 4/38, 4/67, 5/67, 6/68, 7/84, 8/100, 9/170, 10/170 **బౌలింగ్:** ఎన్గిడి 5-1-26-2, జెన్సన్ 5-0-35-2, రబడా 6-1-38-1, కోర్ట్జే 4-0-35-3, మహరాజ్ 2-0-27-1.

శ్రీలంకకు ఊరట...

నెదర్లాండ్స్‌పై 5వికెట్ల తేడాతో గెలుపు

లక్నో: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక బోణీ కొట్టింది. హ్యాట్రిక్ ఓటములతో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక జట్టు నెదర్లాండ్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. నెదర్లాండ్స్ నిర్దేశించిన 263 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక జట్టు 48.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. సదీర సమరవిక్రమ (91), నిస్సంక(54) అర్ధసెంచరీలతో మెరిసారు. అసలంక(44), ధనంజయ డిసిల్వ(30) బ్యాటింగ్‌లో రాణించారు. తొలుత కుశాల్ పెరీరా(5), ఆ తర్వాత కెప్టెన్ కుశాల్ మెండిస్(11) నిరాశపరిచారు. ఆ తర్వాత నిస్సంకతో కలిసి సమరవిక్రమ మూడో వికెట్‌కు 52 పరుగులు జోడించాడు. ఆ తర్వాత అసలంకతోనూ 77 పరుగులు జతచేసి లంకను విజయపథంలో నడిపించాడు. ధనంజయ డిసిల్వతో ఐదో వికెట్‌కు 76 పరుగులు జోడించిన సమరవిక్రమ మ్యాచ్‌ను ముగించి ప్లేయర్ ఆఫ్ ది అవార్డును అందుకున్నాడు. అంతకుముందు నెదర్లాండ్స్ 49.4ఓవర్లలో 262పరుగులకు ఆలౌటైంది. సిబ్రాండ్(70), వాన్ బీక్(59)లు డచ్ జట్టును ఆదుకున్నారు. శ్రీలంక బౌలర్లలో మధుశంక, రజితలకు నాలుగేసి వికెట్లు దక్కాయి.

'షరతులు వర్తిస్తాయి' ఫస్ట్‌లుక్ విడుదల

'మనుషులు ఉన్నంత కాలం కుటుంబాలు ఉంటాయి.. అలాగే కుటుంబాలు ఉన్నంతకాలం సమస్యలు ఉంటాయి. అందుకే చాలా కుటుంబాలు కొన్ని షరతుల మధ్యన జీవిస్తూ ఆనందంగా ఉంటున్నాయి' అని దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై కుమార స్వామి (అక్షర) దర్శకత్వంలో తెరకెక్కిన 'షరతులు వర్తిస్తాయి' ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ని తాజాగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున్ సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మాణంలో చైతన్యరావు, భూమి శెట్టి జంటగా నటించారు.

'లియో'కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

లవకుమార్

'లియో' సినిమా వసూళ్ల విషయంలో తాము ఎంతో సంతోషంగా ఉన్నామని ఆ చిత్ర నిర్మాత లలిత్‌కుమార్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తమ చిత్రానికి మంచి ఆదరణ వస్తోందన్నారు. తమ చిత్రం రూ.1000 కోట్ల క్లబ్‌లోకి వెళ్తుందని తాము అనుకోవడం లేదన్నారు. తమిళనాడులో ఉదయం నాలుగు గంటలకు షోలు వేయకపోవడంతో దాదాపు రెండు లక్షల మంది వేరే రాష్ట్రాలకు వెళ్లి సినిమా చూశారన్నారు. 'లియో'కు వస్తోన్న రెస్పాన్స్ పట్ల నాకెంతో ఆనందంగా ఉంది. ఎందుకంటే హిందీ మార్కెట్ నుంచి భారీ కలెక్షన్స్ ఆశించడం లేదు. అభిమానులను దృష్టిలో ఉంచుకుని బెనిఫిట్ షోల కోసం ఎంతో ప్రయత్నించాం. కోర్టుకు కూడా వెళ్లాం. అయితే, ఈ విషయంలో విజయ్ అస్సలు జోక్యం చేసుకోలేదు. 'కోర్టుకు ఎందుకు వెళ్లారు. అంత అవసరం ఏముంది?' అని ప్రశ్నించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో సినిమా రిలీజ్ కావాలని ఆయన కోరుకున్నారు. 'మాస్టర్' టైమ్‌లోనే విజయ్‌కు ఏదైనా గిఫ్ట్ ఇవ్వాలనుకున్నా. కాకపోతే ఆయన అంగీకరించలేదు. 'నాకు జీతం ఇస్తున్నారు కదా. అది చాలు. ప్రత్యేకంగా గిఫ్టులు ఏమీ అవసరం లేదు' అన్నారు. మా సినిమా చూసి రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. సినిమా తనకెంతో నచ్చిందని.. నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయని మెచ్చుకున్నారు' అని లలిత్ కుమార్ తెలిపారు.

సెమీస్‌లో ఓడిన సింధు..

డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఒడెన్సె(డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ సూపర్-500లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. సెమీస్‌కు చేరిన ఏకైక మహిళా షట్లర్ పివి సింధు శనివారం స్పెయిన్ స్టార్ కరోలినా మారిన్ చేతిలో పోరాడి ఓడింది. హోరాహోరీగా సాగిన సెమీస్ పోటీలో సింధు 18-21, 21-19, 7-21తో మాజీ నంబర్ వన్ క్రీడాకారిణి కరోలినా మారిన్ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. చైనా షట్లర్ల మధ్య జరిగే మరో సెమీస్‌లో 3వ సీడ్ చెన్-యుఫీ 21-18, 21-12తో 8వ సీడ్ హన్-యుపై నెగ్గి ఫైనల్లోకి దూసుకెళ్లింది.

ఓటమెరుగని జట్ల మధ్య గెలుపెవరిదో..?

పొంచివున్న వర్షం ముప్పు
మధ్యాహ్నం 2.00గం॥ల నుంచి

ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో ఓటమి ఎరుగని జట్లు ఏవైనా ఉన్నాయా? అంటే.. అవి రెండు ఈ జట్లే.. ఒకటి ఆతిథ్య భారత్ కాగా.. మరోటి న్యూజిలాండ్. ఈ రెండు ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ విజయాలను నమోదు చేసుకున్నాయి. ధర్మశాలలోని హిమాచల్‌ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఆదివారం జరిగే ఈ మ్యాచ్‌కు వానగండం పొంచి ఉందని ఇక్కడి వాతావరణశాఖ పేర్కొంది. మధ్యాహ్నం సమయానికి తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపింది.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	న్యూజిలాండ్	4	4	0	8	+1.92
2.	భారత్	4	4	0	8	+1.65
3.	దక్షిణాఫ్రికా	4	3	1	6	+2.21
4.	ఆస్ట్రేలియా	4	2	2	4	-0.19
5.	పాకిస్తాన్	4	2	2	4	-0.45
6.	బంగ్లాదేశ్	4	1	3	2	-0.78
7.	నెదర్లాండ్స్	4	1	3	2	-0.79
8.	శ్రీలంక	4	1	3	2	-1.04
9.	ఇంగ్లండ్	4	1	3	2	-1.24
10.	ఆఫ్ఘనిస్తాన్	4	1	3	2	-1.25

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రెట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68